# అగ్గిపుల్ల

"మద్దినాల పేళ"—

అగ్గికి పుల్లల్లేవన్చెప్పి, తోట్లంట పుల్లలేరుకొందికి తట్టొకటి నెత్తిన పెట్టుకొని నెమ్మదిగా ఇంటినించి బయల్దేరింది సముద్రాలు.

చిన్నమ్మి (ముద్దు పేరు "సిలుక") సముద్రాలికి స్వంత చెల్లెలు.

దార్లో చెల్లెలింటి దగ్గిరాగి ఆమెని సాయానికి రమ్మంది సముద్రాలు.

చిన్నమ్మి రాలేనంది.

"మీ యత్త నిన్నేటనకుండా నే సెప్తాలేయే" అంది సముద్రాలు.

చిన్నమ్మికి ఆమె అత్తకీ మధ్య పచ్చగడ్డెప్పుడూ మచ్చుకైనా కనిపించదు. "చినేమాలో సూరేకాంతవే! సూరేకాంతం నీ యత్తే అత్త!" అంటూంటారు పట్నంవెళ్ళి సినీమాలు చూసొచ్చిన వారంతా ఆమెతో. చిన్నమ్మికి ఆ చినేమాగోలేటో తెల్దుగాని ఇంట్లో గోల్తోటే

తెల్లారిపోతంది! మొగుడు మంచివాడే కాని మెత్తని మనిషి. కొడుకు మెత్తని తనం కనిపెట్టి ముసిల్ది ఆస్తంతా చేజిక్కించుకొని కొడుకుని మాపేసి కూతుర్ని పెంచుతోంది. జోగులుబాబూ, మున్సిబ్బాబూ ఆ అమ్మకి ఎనకదన్ను! ఈ బొమ్మలాటంతా ఆళ్లే ఆడిస్తన్నారు! ఆ సంగతి చిన్నమ్మికి తెలుసు. "ఆళ్ళ మెడకాయల్నరికేసి, పాలకుండ లేళ్లాడదీసినట్టు తలకాయ లేళ్ళాడదీద్దా" రన్నంత కోపంతో అప్పుడప్పుడు కుతకుతలాడి పోతూంటుంది చిన్నమ్మి! తన కోపం చూసి తనకే భయం వేస్తుందామెకి. కాని 'తప్పంతా ఆళ్ళదే! ఇవతలోళ్ళు కత్తులుచ్చుకునేదాకా అలా కాల్సుకు తినేడం ఆళ్ళకది నాయెం కాదు!" అని సమాధాన పర్చుకొంటూ ఉంటుందామె.

"దాన్తో నువ్వే టనక్కర్లేదు! ఆ మరిడీ మాలచ్మమ్మతో ఇయాళ రావ(రావణ యుద్ధమైపోనాది. నా మనుసేటో కాని బావునేదు" అంది చిన్నమ్మి.

"తల్లి తల్లి! ఇయాళ గుండెల్ల సెడ్డపోటు లెగిసిందే! ఒక్కర్దాన్నీ ఎళ్ళలేను. ఇయాట్టి కొక్కపొద్దు ఒక్కడుగు రాయమ్మా!" అని చెల్లెల్ని బతిమాలుకొంది సముద్రాలు.

అక్కా చెల్లెలూ కూడా ఒక్క పోలిక మనుషులే. వాళ్ళివ్వగలిగినదేదైనా సరే, మంచిగా అడిగితే చాలు సంతోషంతో ఇచ్చేస్తారు. అంచేత మరి అక్క ఆ విధంగా జాలిగా అడిగినప్పుడు చెల్లెలు కాదన లేకపోయింది.

"పోటు లెగిస్తే నువ్వింటి కాడుండు. నా నెళ్లొస్తా" అంది చిన్నమ్మి.

అందుకు అక్క వప్పుకోలేదు. "చచ్చేదాకా ఉండవలసిన పోటే అది. ఇవాళ రవ్వంత ఎక్కువగా ఉందంతే! ఆపాటిదానికి

నా పాటు నేను పడకుండా నిన్ను పంపించీదా! అలా వీల్లేదు. ఇవాళ్టికి కాస్త పక్కన సాయం ఉండు, చాలు" అంది సముద్రాలు.

చివరకి చిన్నమ్మి కూడా ఓ తట్ట పట్టుకొంది. తోటల్లో పుల్ల లేరుకొందికి ఇద్దరప్ప చెల్లెళ్లూ నెమ్మదిగా బయల్దేరేరు.

ఎండ నిప్పులు చెరుగుతోంది. గాలి సెగలు విసురుతోంది.

* * *

పద్నాలుగేళ్ల కిందట— ఎస్! అంతే! పద్నాలుగేళ్ళవుతుంది. తల్చుకొంటే నిన్నకాక మొన్న జరిగినట్టుంది— పద్నాలుగేళ్ళ కిందట శేషగిరో సారి అగ్రహారం వెళ్ళి, మూణ్నాలుగు రోజులు కాబోలు అక్కడున్నాడు. అప్పటికి శేషగిరి ఇంజనీరింగ్ పరీక్ష పాసయి, అప్రెంటిస్‌గా ఉన్నాడు. "అగ్రహారం ఎప్పుడైనావచ్చి నాలుగు రోజులపాటు మా ఇంట్లో భోంచేస్తే తప్పా?" అని కామేశం చాలా సార్లు అన్నమీదట, "సరే! పల్లెటూరెలా ఉంటుందో ఓ సారి వెళ్ళి చూద్దాం" అనుకొని బయల్దేరి అక్కడికి వెళ్లేడు శేషగిరి. వెళ్ళి, నాలుగు రోజులు కాబోలు చిన్న హాలీడే ట్రిప్పుకింద అక్కడున్నాడు.

నాజూగ్గా, పొడవుగా, నవనవలాడుతూ లేత తమలపాకులా ఉండేవాడా రోజుల్లో శేషగిరి. అతణ్ని చూడగానే "ఇతను పెద్ద సిటీలో పెరిగేడు. ఇతనికి బాగా డబ్బుంది. ఏ ఇబ్బందీ ఇతనెప్పుడూ ఎరగడు" అని తెలుస్తుంది. అతను ఇంటర్మీడియేటూ, ఇంజనీరింగూ కూడా మెడ్రాస్‌లోనే చదివేడు. అతని తండ్రి అప్పట్లో జీతం కింద నెలనెలా వెయ్యేసి రూపాయలు తెచ్చుకొనేవాడు. ఆయన ఢిల్లీలో ఉండనప్పుడు బొంబాయిలో ఉంటుండేవాడు. రిటైరయేక కాకినాడ్లో మకాం పెట్టేడు. అతనికి యావత్ప్రపంచంలోనూ బ్రిటిష వాళ్ళ తరువాత అంతటి ఘనులు ఇండియాలో దక్షిణాదివాళ్లే తప్ప మరొకరు

లేరనే నమ్మకం ఉండేది. అందుచేత మెట్రిక్ అవగానే చదువుకి కొడుకుని మెడ్రాస్ పంపించి అక్కడ హాస్టల్లో ఉండే కుర్రవాణ్ణి జాగ్రత్తగా కనిపెడుతూ ఉండవలసిందిగా తన బావగారికి చెప్పివచ్చేడు.

అప్పణ్ణించీ కూడా మామయ్యగార్ని వీరునిగా పూజిస్తూ వస్తున్నాడు శేషగిరి. ఆయన పేరు రాజారావుగారు. మేనల్లుళ్ళకీ మేనగోడళ్ళకీ అతను "లండన్ మావయ్య."

రాజారావుగారు చిన్నతనంలోనే లండన్ వెళ్ళి అక్కడ పదేళ్లుండొచ్చేట్ట. అతనికి మెడ్రాస్‌లో భారీ వ్యాపారం ఉంది. ఇటీవల అతణ్ణి మనవలంతా కూడా "అమెరికా తాతయ్య" అంటూంటారు. ఎంచేతనంటే, ఆయన వ్యాపారరీత్యా కనీసం ఏడాదికొకసారి ఉత్తర అమెరికా వెళ్తొస్తూ ఉంటాడు. నాజూకైన మనుషుల్లో నవనాగరీకులు నివసించడానికి ప్రపంచంలోకల్లా ఆయన అంచనా ప్రకారం రెండే రెండు స్థలాలున్నాయి. ఒకటి: చికాగో; రెండు: పారిస్.

లోకంలో ప్రతి మనిషీ కూడా ఎవరో ఒక బాస్వెల్‌కి జాన్సన్‌గా ఉండి తీరుతారుట. లండన్ మావ శేషగిరికి జాన్సనుగా ఉంటున్నాడు. చిన్నప్పుడూ ఇప్పుడూ కూడా ఆయనే శేషగిరి పూజించే హీరో.

ఆరోగ్యంగా జీవించాలంటే నవ్వుతూ జీవించగలగడం చాలా అవసరం అంటారు. ఆరోగ్యానికి నవ్వు అవసరం అయినా కాకపోయినా జీవితంలో అవసరాలు తీర్చుకొందికి మాత్రం నవ్వు చాలా అవసరం అని గ్రహించినవాడు లండన్ మావయ్య. డబ్బు రాబట్టటానికి అవకాశాలున్నప్పుడూ, అధికార్లతోనూ ఎక్కువ్వారితోనూ ఉన్నప్పుడూ, సమానుల్తో అప్పుడప్పుడూ తప్ప నవ్వు నతను వేస్టు

చెయ్యడు. ఇతర మామూలు సమయాల్లో అతిగంభీరంగా మహా భయంకరంగా ఉంటాడతను. రాజులకీ, నవాబులకీ, డ్యూకులకీ, చాలా మంది పెద్ద వారికి చేంతాళ్ళంతేసి పేర్లుంటాయి. అంత పెద్ద పేరున్నట్టుంటుంది లండన్ మావయ్య ముఖం. అతని మామూలు ముఖం తీరు అతను కారు డ్రయివు చేసుకువెళ్తూన్నప్పుడు స్పష్టంగా తెలుస్తుంది. "ఏవిటీ పశువులు ? ఏవిటీ మనుషులు ? ఏవిటీ కుష్టు రోగులూ, ముష్టివెధవలూ, రోడ్ సెన్స్ లేని వెధవలూను? ఏవిటీకంపు, ఏవిటీకుళ్ళు, ఏవిటీ ఊరు ? ఏవిటీ దేశం? ఇక్కడా నేనుండడం ?" అనుకొంటున్నట్టుగా అతని ముఖంలో కోపం, క్రౌర్యం, అసహ్యం, ఆశ్చర్యం, జుగుప్స, ఇంపేషెన్సు, సెల్ఫ్‌పిటీ వగైరా అన్నీ కనిపిస్తాయి. ఆ ముఖాన్నే "ప్రభువుల మొహం", "సర్కార్ మొహం", "దొర మొహం", లేక "గొప్ప మొహం", అంటారు. అతను రాష్ట్రం లోని ప్రభువర్గంలో అతి ముఖ్యుడని అందరికీ తెలుసు.

పైకి ఎంతో సీరియస్‌గా అతి గంభీరంగా ఉన్నప్పటికీ నిజానికి లండన్ మావయ్య ఎంతో సరదా అయిన మనిషని పెద్దలందరికీ తెలుసు. అతను లేన్దే ఊళ్లో ఏ పెద్ద పార్టీ కూడా జరగడానికి వీల్లేదు. పార్టీలకి ప్రాణం అతను. పెద్దవారికి తెలియని ఆశ్చర్యకరమైన విషయాలతనికి ఎన్నో తెలుసు. ఒక మొగుడికోసం ఇద్దరు చేపల వాళ్లెలా దెబ్బలాడుకున్నారో అతనొకసారి ఇమిటేట్ చేసి చూపెట్టేసరికి, తాగి స్పృహ తప్పి పడిపోయిన పెద్దలూ ఆడపిల్లలూ అంతా కూడా టక్కున లేచి కూర్చొని నవ్వలేక చచ్చిపోయి, అతనికి చెయ్యెత్తి జేకొట్టి వెంటనే మరో పార్టీ కూడా ఏర్పాటు చేసుకున్నారు. అదే మాదిరిగా, ఉపవాసం ఉన్న విధవరాలితో దూదేకులవాని సంభాషణ,

షావుకారు ఏడుపు, ఆడారివాని ప్రేమ—ఇటువంటివన్నీ ఇమిటేట్ చేసి చూపించడంలో అతన్ది అందెవేసిన చెయ్యి.

మొత్తంమీద లండన్ మావయ్య లేన్దే అధికార్లెవరూ కూడా ఉండలేరు. అతని వ్యాపారం కూడా సజావుగా చక్కగా సాగిపోతుంది. అతను విస్కీలో చేపలా ఈదగలడు. గోకులంలో కృష్ణుల్లా విహరించ గలడు. డబ్బు దగ్గిర అతి నిర్మోహమాటంగా ఉండగలడు. "ప్లీబియన్ బగర్స్‌నీ ప్రొలిటేరియన్ స్కౌండ్రల్స్‌నీ" మినహాయించేస్తే అతను సర్వమానవ సౌభ్రాతృత్వానికి జోహార్లర్పించగలడు. ముసలి కాలం వచ్చినా ఇప్పటికీ కూడా అతను చాలా అందంగా ఉంటాడు. లండన్లో ఉన్నప్పుడుగాని, అమెరికా వెళ్ళినప్పుడుకాని, అతణ్ని ఇండియన్ అని ఎవ్వరూ అనుకోలేదట. కనీసం, ఏదో తూర్పు యూరపు దేశం వాడయుంటాడని అనుకోడం జరిగిందట. అతని రంగు అంత బావుంటుంది. అతని మానర్సు అంత పెర్ఫెక్ట్‌గా ఉంటాయి. మామూలుగా చూస్తే అతను యూదులమధ్య నాజీలా కనిపించినప్పటికీ, కావలసొచ్చినప్పుడు అతిప్లెజెంటుగా ఉండగలడు. "జాలీ గుడ్ ఫెలో" అనే పేరు సంపాదించే డతను.

శేషగిరి తన లండన్ మావని ఇప్పటికీ ఎప్పటికీకూడా హీరోగా చూసుకొంటూఉంటాడనడంలో ఏ సందేహమూ లేదు.కాలేజీలో ఉన్నప్పణ్నించీ కూడా శేషగిరికిక్కూడా ప్రభువుల మొహంపెట్టుకు తిరగడం బాగా అలవాటయింది. లండన్ మావయొక్క ఆధిక్యత గ్రహించడంతోపాటు జీవితంలో డబ్బు యొక్క ఆవశ్యకతని కూడా చిన్ననాడే గ్రహించేడతను. ఎంత పెద్దవాళ్ళనయినా బెబ్బతియ్యగల శక్తి డబ్బుకున్నదని అతనికి ప్రత్యేకంగా ఎవరూ చెప్పకుండానే తెలిసింది. తను డబ్బుగలవాణ్ననే సంగతీ, అవతల వాళ్ళంతా డబ్బుకోసం పడిచస్తారనే

సంగతీకూడా చిన్నతనంలోనే బాగా తెలిసికొనడంచేత అతని గొప్ప ముఖంలో వెటకారం మూడు పాళ్ళు కనిపిస్తుంది.

శేషగిరి థర్డ్‌ఫారం చదువుతూన్నప్పుడు కమలాకరమనే కాణీ లేని కుర్రవాడొకడతనికి క్లాసుమేటుగా ఉండేవాడు. చాకలేట్లూ, పిప్పరమెంట్లూ తెగతెచ్చుకొని అదేపనిగా శేషగిరి తింటూంటే అవి తినాలని కమలాకరానిక్కూడా తెగకోరిగ్గా ఉండేది. కాని వెంటనే నోరువిడిచి అడిగేవాడు కాడు. వాటికోసం అతను తన చుట్టూ తిరుగుతున్నాడని స్పష్టంగా తెలిసినా శేషగిరి ఒకటీ ఒకటీ అలా తింటూండేవాడేకాని ఒక్కటయినా అతనికి ఇచ్చేవాడు కాడు. చాకలేట్లవైపు అదేపనిగా చూసే "కమలాకరంగాడి ద్రాపిమొహం" చూస్తూంటే శేషగిరికి లోలోపల అతి నవ్వొచ్చేది. అతనికి కమలాకరాన్ని ఊరించడం చాలా సరదాగా ఉండేది. కమలాకరం అటూ ఇటూ చుట్టూ తిరిగి ఆఖరికెలాగైతేనేం, "ఒరే గిరీ! నాకో చాకలేటివ్వవురా?!" అని అడుగుతే, "అరె! ఇందాక అడగలేదేంరా! ఒక్కటే ఉంటే అదిప్పుడే రాజుగాడికిచ్చేసేను." అనేవాడు శేషగిరి. ("అప్పుడొరే రాజూ! కమలాగాడి మొహం చూడాలీ! నవ్వలేక చచ్చేన్రా!") రాజుగాడు అప్పటి హెడ్మాష్టర్‌గారబ్బాయి. అతనెప్పుడూ శేషగిరిని చాకలేట్లడిగేవాడు కాదు. అడక్కుండానే ఆ అబ్బాయికి తను చాకలేట్లెందుకిచ్చేవాడో, అడిగినా కమలాకరానికి ఎందుకిచ్చేవాడు కాదో అనే విషయం గురించి శేషగిరెప్పుడూ ఆలోచించలేదు. కమలాకరాన్ని తల్చుకొన్నప్పుడల్లా శేషగిరికి చిరునవ్వు పుట్టుకొస్తూంటుంది. దేశం నిండా అటువంటి కక్కుర్తి మనుషులున్నప్పుడు దేశం ఇలా కాక ఇంకెలా ఉంటుందని పిస్తుందతనికి.

చాకలేట్లకోసం కమలాకరం పడి చచ్చిపోయినట్టు అల్లుళ్ళకోసం కామేశం పడి చచ్చిపోయేవాడు.అగ్రహారమే అతని కాపురస్థలం,అతనికి

ఆరుగురు కూతుళ్ళుండగా నాలుగెకరాల పొలం మాత్రం ఉండేది. అతనికి చదువులేదు. ఉద్యోగంలేదు. డబ్బులేదు. అతనికి "ఆశమాత్రం బండెడు!" అని శేషగిరి తల్లి అంటూండేది. పెద్ద కూతుళ్ళిద్దరికీ ఎలాగో పెళ్ళిచేసి మూడో కూతురి వివాహంకోసం అతనారోజుల్లో తంటాలు పడుతూండేవాడు. అతను శేషగిరికి పెద్ద దగ్గిరబంధువేం కాడు. కాకపోయినా శేషగిరి తండ్రి దగ్గిర కతడు మాటిమాటికీ కాకినాడ వస్తూండేవాడు. అతని ఊరుకూడా కాకినాడకి దగ్గిర్లో లేదు. ఏ పనీ లేకపోయినా ఎక్కడో వైజాగ్ దగ్గిర్నించి పనికట్టుకు వస్తూండే వాడతను." "పంచదారెక్కడుంటే కండచీమలక్కడుంటాయని తెలుసుకోరా నాయనా అంటూండేది శేషగిరీ వాళ్ళమ్మ. ఆ విడెప్పుడూ తెల్లగా మెత్తగా, లావుగా, జబ్బుగా ఎప్పుడూ మంచంమీద నాలుగు తలగడాలు తలకింద పెట్టుకొని పడుక్కునుండేది. ఆవిడకి పంచదారంటే చాలా ఇష్టం. కాఫీలో అందరికంటె ఓ చెమ్చా పంచదార ఎక్కువ్వేసుకొనేదావిడ. ఆవిడ చాలా నాజూకైన మనిషికూడాను. ఎవరి తాలూకుపిల్లలో కాని ఓ సారి చెరుగ్గెళ్ళకోసం ఏడుస్తూంటే ఆవిడ చాలా చిరాకుపడి, "మోటుతిళ్ళూ మోటు మనుషులూను!" అనుకొంది. పంచదారుండగా, పిప్పరమెంట్లుండగా, చాకలేట్లూ, బిస్కెట్లూ ఉండగా "చెరుగ్గెళ్ళు! అవెందుకూ!?" అని చాలా ఆశ్చర్య పోయిందావిడ. ఆవిడకి పువ్వులంటే కూడా చాలా ఇష్టం. కాని మొక్కల్ని పెంచడం అంటే ఆవిడకి చెడ్డ తలనొప్పి. ఫాషన్‌కోసం అయినా ఆవిడెప్పుడూ ఎంత మంచి మొక్కకైనా నాజుకోసం అయినా సరే నీళ్ళు జల్లెర గదు. ఆవిడకి కండచీమంటే అదోరకం భయం ఉండేది. కనిపించిన చీమనల్లా డి. డి. టి తో సర్వెంట్నొచ్చి చంపేస్తేకాని నిద్రపట్టేదికాదు. ఆవిడకి కామేశాన్ని చూస్తే ఇష్టంలేదు.

కాని, శేషగిరి తండ్రి మాత్రం కామేశం ఇంటికొస్తే తగురీతిగా అతణ్ని ఆదరించేవాడు. "పేదవాడైనా ఎంత వినయం!" అని కామేశాన్ని మెచ్చుకొనేవాడతను. డబ్బడక్కుండా అణకువగా వినయ విధేయతలతో ఉన్న బీదవార్ని చూస్తే అతని కదొక విధమైన ఆనందమూ, సంతృప్తీ కలిగేవి. భిక్షాధికార్ల మంచితనమే లక్షాధికార్ల సెక్యూరిటీ అనే విషయం ఎలా గ్రహించేదోకాని గ్రహించగలిగేడతను. "కుర్రాణ్నోసారి మా ఇంటికి రానియ్యకూడదా బాబూ?" అని కామేశం అంటే "సరే" నన్నాడు శేషగిరి తండ్రి.

పల్లెటూరి లైఫ్ ఎలా ఉంటుందో మచ్చుకోసారి చూదాం అని శేషగిరి క్కూడా కుతూహలం కలిగింది. అందుకనే బయల్దేరి వెళ్లేడు.

వెళ్లేడు కాని, కామేశం చూపించే ఆదరణ చూసి శేషగిరెంత మాత్రం మోసపోలేదు. "కూతుర్ని దానికనీ దీనికనీ దగ్గిరికి పంపించి నిన్ను మచ్చిక చేసుకోవాలని చూస్తాడుస్మా! జాగ్రత్త మీదుండు", అని అతను బయల్దేరేముందు తల్లి హెచ్చరించింది. అటువంటి హెచ్చరికల అవసరం అతని కెంత మాత్రం లేదు. బోల్తా కొట్టించాలే కాని బోల్తా పడకూడదని అతనికి బాగా తెలుసు. ఆడవారి విషయంలో అప్పటి కతనికి ఇరవయ్యేళ్ళ వయసే అయినప్పటికీ— అతని కప్పటికప్పుడే నాలుగేళ్ళ అనుభవం ఉన్నదనే సంగతి అతని తల్లికి తెలీదు. ఆ ఫీల్డులో మంచి ఎక్స్పర్ట్ అనే పేరు కూడా అతను సంపాదించేడు. పరువు కాయల కోసం చిలకలు ప్రతిచెట్టూ వెతికినట్టు, వెళ్ళిన ప్రతిచోటా ఆడపిల్లల కోసం వెదకడం నేర్చుకున్నాయతని కళ్ళు.

కామేశం ఉంటోన్న పల్లెటి అగ్రహారం చూసి శేషగిరి అసహ్యించుకున్నాడు. "అసలు మన తెలుగువాళ్ళు డర్టీ ఫెలోస్"

అనే అభిప్రాయం అతని కెప్పుడ్నించో ఉంది. అగ్రహారం చూసేక, "ఈ పల్లెటూరి వెధవలు మరీ డర్టీ బ్రూట్స్" అనిపించిందతనికి. బతుక్కి బాగులేకపోయినా రైతుజనం అంతా కూడా రూపుల కి మాత్రం అజ్ఞాతవాసంలో ఉన్న రాజుల్లా ఉండడం అతనికి చాలా చిరాక్కలిగించింది. "రైతు వెధవల కింత పర్సనాలిటీ ఎందుకు?" అనుకున్నాడతను.

వెళ్ళీవెళ్ళగానే కామేశం మూడో కూతురు కోసం శేషగిరి కళ్ళు వెతకడం మొదలుపెట్టి ఆ పిల్లని కనిపెట్టి "ఫరవాలేదు, పకడ్బందీగానే ఉంది" అని సర్టిఫికేటిచ్చేయి.

ఆ పిల్ల పేరు లలిత. పదహారేళ్ళకి ఆ పిల్ల గుర్రంలా ఎదిగింది. పంచదార్లాగా పనసతొన్లాగా ఉందామె. పల్లెటూరితనం కొంత కనిపిస్తున్నప్పటికీ ఆ వయసు ఆడపిల్లలకున్న గడుసుతనం కొంచెం ఆమెలో కనిపిస్తోంది. ఇంగ్లీషు చదువు లేకపోయినా, తెలుగు చదువు కొంతవరకూ ఆమె చదువుకున్నట్టుంది. మొత్తంమీద ఆమె, కొంచెం నిమ్మరసం తగిలిన పంచదార పానకంలా వుంది.

కామేశం తనకి "దాన్నంటగడదామని" బండెడాశతో వున్నాడని శేషగిరికి తెలుసు. పిల్ల కూడా బాగానే వుంది. గుడ్ మీట్! అయితేనేం? పంచదార్లాగా పనసతొన్లాగా వుంటే చాలు ఏ పిల్లనైనా పెళ్ళాడేవొచ్చు ననుకొంటే, అలాటి పిల్లలు ముష్టి వాళ్ళల్లోకూడా చాలా మందుంటారు— పెళ్ళాడతామంటే చేసుకొందికి సిద్ధంగా! బంధుత్వం వీలు చూసుకొని డబ్బున్న అల్లుణ్ని "చవగ్గా ఛాన్సు కొట్టేద్దా మనుకుంటున్నాడీ కామేశంగాడు". అతని "అడాసిటీ"కి ఆశ్చర్యపోయేడు శేషగిరి. పల్లెటూరి వెధవలు కూడా గడుసు వెధవలే! అయితే శేషగిరేనా గడుసువాడు కాద్దీ?

కామేశంగాడికి మస్కా కొట్టాలి. మంచి కూతుర్నే దాచి పెట్టేడు. పిల్లని చూపించి గోతివైపు నడిపించి బోల్తా కొట్టిద్దాం అనుకుంటున్నాడు. ఇలాటి వెధవని బోల్తా కొట్టిస్తే వుంటుంది తమాషా! పిల్ల కూడా ఫరవాలేదు. రుచి తెలీక బెదురుతోందంతే.

కామేశంగారిల్లు "అశోకుడి టైంలో కట్టించుంటారు." కప్పు మీది పెంకులన్నీ నాచుపట్టి ఆకుపచ్చగా వున్నాయి. కప్పుకూడా సరిగా లేకుండా, లొత్తలుపడి ఎగుడు దిగుడుగా వుంది. ముందువైపు నడవలో రెండు కొట్లున్నాయి. అందులో ఓ కొట్లో బెడ్డింగూ తోలుసంచీ పడేశాడు శేషగిరి. ఇంట్లో వున్నవాళ్లు కామేశం కాక అతని నలుగురు కూతుళ్లు. మిగతా ఇద్దరూ అత్తవారిళ్లల్లో వున్నారు. కామేశం భార్య చనిపోయి అప్పటికి ఏడాది దాటింది. అతను చాలా చిక్కుల్లోనూ బాధల్లోనూ వున్నాడని చూడగానే తెలుస్తుంది. కాని అతను శేషగిరిని చాలా గౌరవంగానూ అభిమానంతోనూ చూసుకున్నాడు. శేషగిరి నతనే విధంగానూ అనుమానించలేదు. ఐశ్వర్యవంతులకేవో కొన్ని మంచి లక్షణాలు లేకపోతే వారంత అదృష్టవంతులు కాలేరని అతని నమ్మకం. కుచేలుడికి కృష్ణుడి యందుండేలాటి నమ్మకం అతనికి ఐశ్వర్యవంతుల యందున్నదని స్పష్టంగా తెలుస్తుంది. అతను శేషగిరిని బాహాటంగా ఏమీ అపనమ్మకం లేకుండా ఇంట్లో విడిచి పెట్టేసేడు.

శేషగిరి కళ్లు అటూ ఇటూ పరిగెడుతూ లలితను వెంటాడుతున్నాయి. ఆమె తలుపుల రెక్కలచాటునా, నూతిగట్టుపక్కనా గోడలవారగా దాగుంటోందే కాని ఎదురుగా తారసపడ్డంలేదు. తండ్రికి తననా కుర్రవాడి కివ్వాలనుందని ఆమెకి తెలియకపోలేదు. అందుచేత ఆమెకి సిగ్గుగానూ, శేషగిరి కళ్లు చూసి భయంగానూ కూడా ఉంది. అసహాయలైన ఆడపిల్లల యెడల అతను చాలా చొరవ చూపించగలడనే

విషయం ఆమె కొంచం ఆచోకీ కట్టినట్టుంది. హైస్కూలు ఆడపిల్లలు కొంతమంది, ఉన్నరంగుకంటే పెదిమలు ఎర్రగా కనిపించడానికి పెదిమల్ని నాలికతో తడిచేసుకొంటూ ఉండడం శేషగిరి గమనించి, తనుకుడా ఆ అలవాటు చేసుకున్నాడు. పామునాలికలా మాటిమాటికీ అతని నాలిక అలా బైటికి రావడం చూసి లలిత ఇంకొంచంగా భయ పడింది.

వెళ్ళిన మర్నాడు, పగలు పదకొండు గంటలకి కొట్లో కూర్చు న్నాడు శేషగిరి. శీతాకాలం అవడంచేత బైటకి వెళ్లినా ఆట్టే వేడిగా లేదు. చిన్నగా చదరంగా ఉన్న కిటికీలోంచి చూస్తే వాకిట్లో ఎండ, సినిమాలో ఎండలా, వేడిలేకుండా కనిపిస్తోంది. కొట్లో అదొకరకం ముక్కవాసన వేస్తోంది. గోడని రాములవారి పట్టాభిషేకం బొమ్మొకటి దుమ్ముపట్టిన అద్దంలోంచి అలుక్కుపోయి కనిపిస్తోంది, ఐస్‌బాక్స్ లోంచి అప్పుడే తీసినట్టుగా కొట్టంతా అతి చల్లగా ఉంది. కిటికీకి పక్కగా గోడమీద బొగ్గుతో ఎవరో ఓ మనిషి ముఖం గీసేరు. ఆ బొమ్మ కళ్లని ఆతరవాతెవరోకాని మేకుతో పొడిచిపొడిచి రెండు గుంటలు చేయడంచేత అదొక చచ్చిన ముఖంలా కనిపిస్తోంది. కొట్టంతా ప్రేమకి దూరంగా చావుకి దగ్గరగా ఉన్నట్టనిపిస్తోంది. ఎక్కడో ఎవరో ఆడమనిషి మరింక ఎన్నటికీ తిరిగిరాని ఎవరి గురించో కాని తల్చుకుతల్చుకొని వరసపెట్టి ఏడుస్తోంది. సముద్రంలో ఉండిపోయిన వారికేకలు గాలికీఅలలకీ సన్నగిల్లిపోయి వినిపించినట్లు ఆ మనిషిఏడుపుఉండి ఉండి హీనంగా వినిపిస్తోంది.ఊళ్లో అంతా పొలాల్లో పనుల్లోకి పోడంచేత అలజడేం లేకుండా అంతా ప్రశాంతంగా ఉన్నట్టని పిస్తోంది. దగ్గర్లో ఎక్కడ ఏమాత్రం చప్పుడయినా సుస్పష్టంగా విని పిస్తోంది. ముంజూరుకింద ఓ ముసలమ్మ ఓ పిండిబొమ్మలా కూర్చొని

మంచంమీద ఎండవేసిన వడియాలకి కాపలాకాస్తోంది. రెండిళ్ళమధ్యా ఎండలో ఓ పంది ఏనుగులా నెమ్మదిగా నడిచివెళ్తోంది. "ఈ ఊళ్లో మనుషులకంటె పందులే నయం" అనుకున్నాడు శేషగిరి.

అంతలోనే —

లలిత వచ్చింది.

భోజనానికి పిలవడానిక్కాబోలు కొట్టు గుమ్మం దగ్గరకి వచ్చింది. అందుకోసం అలా, గూట్లో సాలీళ్లా వెయిటు చేస్తూన్న శేషగిరి, కప్పని పాము పట్టినట్టు ఆమెని రెక్కపట్టుకు లోనికి లాగి తలుపువారకి ఈడ్చుకుపోయేడు.

లలిత హడలిపోయింది.

అంతకు ముందుకాని ఆ సమయంలో కాని ఆ పిల్ల కళ్ళల్లోని బెదురూ, ఆ పెదవుల్లో జాలీ, ఆరూపులో దైన్యం అవేవీ శేషగిరికి కనిపించలేదు. ఆమెని ఎలాగైనా అదిమిపెట్టాలనే అతని తాపత్రయాన్ని ఆమె ఎలాగైనా విదిలించుకు వెళిపోదామనే నిశ్చయంతో ఎదుర్కొంటోంది. ఆ సమయంలో కూడా, ఆమె తొడుక్కున్న పువ్వుల జాకెట్టు గుడ్డ గజం పావలా పరకదనీ, ఆమె వేసుకున్న ఎర్రవోణీ గజం ఆరణాల పరక్కి మించదనీ అతను గమనించగలిగేడు. తలంటు స్నానం చేసింది కాబోలు, ఆమె జుట్టంతా కుంకుడుకాయ వాసన వేస్తోంది. భారంగా ఉన్న ఇంజన్లా ఆమె గుండెలు ధన ధన కొట్టుకోడం అతని చేతికి తెలుస్తోంది. పరాయి సొమ్ముని గ్రీడీగా చకచకా పీనారివాడు లాగినట్టు ఆమెని గబగబా ముద్దులాడబోయేడు శేషగిరి. ఆమె గింజుకు గింజుకుని చివరకి బలం చాలక పోవడంచేత, కోపంతో వెనక గోడకి ఠఫీమని తల చేర్చుకొని అతని కళ్ళల్లోకి స్పష్టంగానూ అసహ్యంతోనూ చూస్తూ, "దొంగలాగ! ఛీ!" అంది.

శేషగిరి చప్పుడు చెయ్యకుండా వెటకారంగా నవ్వేడు. నవ్వి, "నేను మామూలు దొంగని కాను; బందిపోటు దొంగని!" అన్నాడు. ఆ పిల్ల అతని మాటలు విన్నట్టులేదు. అతని కళ్ళలోకి నిర్ఘాంతపోయి అలా చూస్తోంది. ఆమెకి వళ్ళంతా జారిపోతున్నట్టయి పోతోంది. భయంగా అతిభయంగా ఉందామెకి. ఆ కళ్ళూ ఆ నవ్వూ, పెదిమెల మీదికి మాటి మాటికీ పాకిరే ఆ నాలికా చూస్తే, వళ్ళంతా నీరయిపో తున్నట్టుగా అనిపించిందామెకి.

"ఇంకా నిజం చెప్పాలంటే, నేను రాక్షసుణ్ణి!" అన్నాడు శేష గిరి సరదాగా నవ్వుతూ.

ఆ నవ్వు మళ్ళీ చూడగానే లలిత కెవ్వున కేక వేయబోయింది. కాని, గొంతుకలోంచి కేక పెగిలిందికాదు. కిటికీలోంచి వచ్చే వెలుగు అతని మీద స్పష్టంగా పడుతోంది. ఎవరూ లేరనుకొన్న వంటగది లోకి వచ్చేసరికి ఎదురుగా గదిమధ్య తోకమీద నిటారుగా నిలబడి, చప్పుడు చెయ్యకుండా, వికృతంగా వికటంగా నవ్విన, ఎత్తుగా సాగిన, పాము పోలిక అతన్లో కనిపించిందామెకి. దాన్తో ఆమెకి మూర్ఛ వచ్చేట్టయిపోయింది. కాని, అంతలోనే బలాన్నంతా నిలదొక్కుకుని శక్తంతా వినియోగించి అతణ్ణి తోసేసి వాయువేగ మనోవేగంతో బైటపడిందామె.

ఆ సాయంకాలం లలిత కనిపించలేదు.

"పిల్లలేరీ?" అని కామేశాన్ని అడిగేడు శేషగిరి.

పక్క పల్లెటూళ్లో ఎవరో చుట్టాలింట్లో మూడు రోజుల పెళ్ళం దట, మూడు రోజులూ అక్కడుండడానికి లలితా మరో ఇద్దరు పిల్లలూ వెళ్ళేరట.

ఆ సంగతి తెలిసేసరికి, పిట్ట తప్పించుకుపోతే పిల్లి తహతహ లాడి పోయినట్టయిపోయేడు శేషగిరి.

రాస్కెల్ ఉడాయించేసింది! తెలుగు చదువేదో కొంత చదివి నట్టుంది దొంగ రాస్కెలు. ఇలాటి ముండలు మంచీ చెడ్డా పాపం పుణ్యం అంటూ పదోయేటనించీ లెక్చర్లు దంచుతారు. అందుకే ఆడ దాన్ని రాతియుగంలో ఉంచినట్టుంచా లంటారు. తెలివి మీరిపోయిన ఇడియట్సు ఈజీగా లొంగరు. "తెలివి మీరిపోతే— దబాయింపు సెక్షను— జులుం పనికిరాదు. అయితే ఏం చెయ్యాలి? ఆకర్షించి మోసం చెయ్యాలి. లేక మోసంచేసి ఆకర్షించాలి" అని క్రూడుగా మోటుగా ఆలోచించి ఒక నిర్ధారణకి రాలేదు శేషగిరి. "టాక్టిక్స్ మార్చాలి; నాటకం మరోలా ఆడాలి" అనే నిశ్చయానికి వచ్చేడతను. లలిత వెళ్ళిపోడంతో అతని అభిమానం దెబ్బతింది. ఏదైనా జయం సంపాదిస్తేగాని ఈ వూరొదల కూడదనుకున్నాడు. కన్వీనియంట్‌గా ఉంటుందికదా అనుకొంటే లలిత "దగా చేసింది!" అందుచేత వేరే ఏ పిట్ట కోసం ఎక్కడ వెతకాలీ అని ఆలోచించగా శేషగిరికి జోగులు గుర్తుకొచ్చేడు.

జోగులు (అతనూ అగ్రహారంలోనే ఉంటున్నాడు) ఇరవయ్యేళ్ల నించీ (అంతే వయసతనికి) ఎండిపోయున్నాడు. అతను వేసుకొనేది పొట్టి నల్లనిక్కరు; తొడుక్కొనేది పొడుగు చేతుల పొట్టి బనీను. ఎదగడం అతను అయిదడుగుల మూడంగుళాల మేరకి ఎదిగి, ఆ తరువాత అక్కడకలా దిగబడిపోయుండి పోయేడు. అతని కళ్లెప్పుడూ చుట్టలకోసవూ, తిండికోసవూ, వెతుకుతూ వుంటాయి. కామేశానికతనేదో దూరపు చుట్టం. కామేశం ఇంటికి శేషగిరి వచ్చీరాగానే జోగులొచ్చి అటెండెన్సు మార్కు చేసుకున్నాడు. మార్కు చేసుకొని

శేషగిరి తాలూకు సామానంతా పరీక్షించేడు. పరీక్షిస్తూ పరీక్షిస్తూ తనేదీ ఎత్తుకుపోకుండా శేషగిరి కనిపెడుతున్నాడనే విషయం కని పెట్టేడు. కనిపెట్టి శేషగిరిని, "ఏం చదివేవు? ఇంజనీరింగా? అంటే ఒవర్సీలేనా? నౌఖరిలో చేరితే జీతం ఎంతిస్తారు? కస్పీలు బాగా కిడతాయంటారు; ఎంతకిడతాయి?" అంటూ ప్రశ్నించేడు. శేషగిరికి ఇంకా పెళ్ళి కాలేదని తెలిసి, "మా కామేశం బావ కూతురుంది, దాన్ని చేసీసుకో" అని లలిత గురించి రికమెండ్ చేసేడు. "అదంటే వాడికి ముద్దు! అచేంత పొలం నీ పేర రాయించేసుకో!" అని సలహా ఇచ్చేడు. "చుట్టలు కాలుస్తావా? లేక సిగరెట్లా?" అని పొగాకు ప్రశ్నొకటి వేసేడు. "చుట్టలు తప్ప నేనెప్పుడోగాని సిగరెట్టు ముట్టను. అదైనా నీలాటి వాళ్ళిస్తేనే!" అని స్వవిషయం స్పష్టంగా తెలియజేసేడు. ఆ రెండు రోజుల్లోనూ శేషగిరి దగ్గిరకతను పదిసార్లయినా వచ్చేడేకాని తీసుకోగలగడం మాత్రం రెండు సిగరెట్లే తీసుకోగలిగేడు.

శేషగిరి ఆ వూరికి వచ్చిన మర్నాటి ఉదయం కామేశంగారి ఇంటి కెదురుగా జోగులు ఎవరితోనో ఇరవయ్యేళ్ళ పిల్లతో మాటాడు తున్నాడు. ఆ పిల్ల "పల్లెటూరి పశువే" కాని "ఎంత అందమైన పశువు! వాట్ ఎ బ్యూటిఫుల్ బీస్ట్!"

ఆమెకి గంపంత కొప్పూ, కుండంత గుండే ఉన్నాయి. రంగు పాలకోవా రంగులో ఉంది. ఆ సమయంలో ఆమె చారెడేసి కళ్ళనిండా ఆశ్చర్యం వుంది. ఆమె చిన్నినోరు ఎర్రదానిమ్మపండు పగుల్లా ఉంది. అందులో తెల్లదానిమ్మ గింజల్లా పలువరసుంది. మామిడి పండులా బొద్దుగానూ,చెరుగ్గెళ్లాపొడుగ్గానూకూడా కనిపిస్తోందామె.ఆమె వంటిమీద-మెళ్లో నల్లపూసలూ, చేతులకిగాజు గాజులూ తప్ప-ఇంకే ఆభరణాలూ కనిపించ డంలేదు. నెత్తినున్న తట్టని రెండుచేతుల్తోనూ పట్టుకొని, సరదాకి

రాణీగారెవరో బీదభామ వేషం వేసినట్టు నిటారుగా నిలబడి జోగుల్తో మాటాడుతోందామె.

మన్మథుడి తమ్ముళ్లా తయారైపోయి వరండాలో నిల్చున్నాడు శేషగిరి. అప్పటికప్పుడే స్నానం చేసేసి, తలకి వాసన్నూనె రాసి దువ్వేసి, ముఖానికి స్నో పూసి పౌడరు కొట్టేసి, స్నో వైట్ మెడ్రాస్ లుంగీ కట్టేసి, మిల్కు వైట్ వైట్ షర్టొకటి తొడిగేసి, కొంచెం తడిసీ తడియని టర్కీ టవెల్ భుజాన్న ఆలా ఉంచేసి, సిగరెట్టొకటి వెలిగించేసి, సామన్తరాజు యొక్క తప్పు క్షమించేసిన పిమ్మట దయతో నవ్వే చక్రవర్తి నవ్వొకటి ముఖానికి తగిలించేసుకు నిలబడ్డాడతను.

"ఒవురా కొత్తబాబు ?" అని ఆమె జోగుల్నడుగుతోంది.

"మా కామేశంబావకి చుట్టం !"

"అల్లుడా ?"

"అల్లుడవాలంటే లక్షిచ్చి కొనాలి. మామూలు రేటుకి దొరకడు."

"ఏం చేస్తున్నాడు ?"

"ఇంజనీరు పని చేస్తాడు."

"అంటే ?"

"అంటే, కంపలేరడం, కలుపు తియ్యడం, పిడక లెట్టడం కాదు."

"మరైతే అదేటో సెప్పరాదా ?"

"ఇంజనీరు పనంటే, పెద్ద పెద్ద ఇళ్లూ, పదేసి అంతస్థుల మేడలూ, పెద్ద పెద్ద వంతెన్లూ, పేద్ద ఏరోప్లేన్లూ—అంటే విమానాలూ కట్టడం అన్నమాట. ఆ బాబు ఆ పన్లన్నీ చేస్తాడు."

"నిజంగానా ??"

"కాపోతే !"

"ఆ బాబే ??"

"ఆఁ! ఆ బాబే! అదేవిఁటాలా చూస్తున్నావు ? దెయ్యవఁను కున్నావా, భూతఁ వనుకున్నావా లేక మంత్రంవేస్తే నిలబడ్డ నల్లరాతి బొమ్మనుకున్నావా—అలా చూస్తున్నావు ? మనిషే! మనిషే! కావలిస్తే వెళ్ళి ముట్టుకు చూడు!" అన్నాడు జోగులు.

శేషగిరిని అతనెవరో పరలోకపు వింతమనిషయినట్టు ఆశ్చ ర్యంగా చూస్తూ వెళ్ళిపోయిందామె.

లలితావాళ్ళ పెళ్ళికి వెళ్ళిపోయేక శేషగిరి కేమీ తోచడంలేదు. మరేదీ బిజినెస్ కనిపించకపోతే బిచాణా ఎత్తేద్దాం అనికూడా అను కున్నాడు. కాని, అంతలోనే పొద్దున్న తనగురించి అడుగుతోన్న ఆడ మనిషీ, సిగరెట్లకోసం చచ్చిపోయే జోగులూ గుర్తుకొచ్చేరు. జోగుల్ని మొదటిసారి చూసినప్పుడే, "ఎవడు పావలా డబ్బులూ, పావలా చుట్టలూ, నాలుగు వేడివేడి ఉల్లిపెసరట్లూ ఇస్తాడో వాడి కా ఖరీదుకి యావద్భారతదేశాన్నీ అమ్మేగలడు వీడు" అనే అభిప్రాయానికి వచ్చేడు శేషగిరి. పొద్దున్న కనిపించిన ఆడమనిషి గురించి తీవ్రంగా ఆలో చిస్తూ "ఇలాటి వ్యవహారానికి జోగుల్లాటివా డుండితీరాలి!" అనే నిశ్చ యానికూ_డా వచ్చే డతను.

అందుచేత వెంటనే జోగుల్ని పిలిచి,

"ఎవరా మనిషి ?" అని అడిగేడు శేషగిరి.

"ఏ మనిషి ?" అని జోగు లడిగేడు.

"పొద్దున్న నీతో మాటాడుతున్న మనిషి."

"ఆడా, లేక మొగా ?"

"మొగైతే నాకెందుకు ? ఆడే !"

"ఎలా ఉంటుంది ?"

"హల్వా, రసగుల్లా, కోవాబిళ్లా—అలా ఉంటుంది. ఒకటో రకం చిలక ! నా గురించి నిన్నేదో అడిగింది."

"అదా ? !"

"అదే ! ఎవరిది ?"

"పోలిగాడి పెళ్లాం ! అదెందుకు నీకు ?"

"కావాల్నాకు."

"తంతుంది."

"తన్నదు."

"ఒకవేళ తంతే ?"

"తాపుల్నువ్వు తింటావు."

"ఒట్టినే తినేదా ?"

"గట్టిగానే తిను."

"బాబూ ! ఈ గొడవల్లో నన్ను ఇరికించకు. బుర్రగీయించుకోడానికి కాణీ లేదెలారా భగవంతుడా అని నే నేడుస్తూ ఉంటే చిన్నారి చిలకలూ గుజ్జారి గులకలూ నాకెందుకు ?"

"నీక్కాదు, నాకు !"

"చేతిలో ఎర్రనేగాణీ...."

"పావలా ఇమ్మంటావా ?"

"పొద్దున్నించీ తాగుదాం అంటే—కాఫీలూ టీలూ అటుంచు—తాగడానికి అప్పుచ్చయినా దొరక్క చస్తున్నాను. మరింక పావలా ఇస్తే ఏం చేసుకోను ? మరో మూడు పావలాలైనా ఇలాపడీ !" అని డిమాండు చేసేడు జోగులు.

జోగులికి కనపడకుండా పర్సులోంచి రూపాయి తీసి అతని చేతికిస్తూ, "మరలా అయితే స్నేహితుడికి సాయం చెయ్యడం మర్చిపోనన్చెప్పి ఒట్టువెయ్యి !" అని శేషగిరి కవుంటరు డిమాండు చేసేడు.

రూపాయి అటూ ఇటూ తిప్పి చూసుకొని నిక్కరు జేబులోకి తోసేసి, "మా అమ్మతోడు ! నా సంగతి నీకింకా సరిగా తెలీడంలేదు. స్నేహంకోసం ప్రాణం తీసేసి ఎదర పెట్టీమంటే అలా పెట్టేస్తాను" అంటూ జేబులోంచి చెయ్యి తీసి, తన ప్రాణాన్ని ఎదరగా ఎలా పెట్టేస్తాదో చూపించి, "నమ్మకం చాలకపోతే ఈ వూళ్లో ఎవర్నయినా అడిగి చూడు," అన్నాడు జోగులు.

అప్పటికి సాయంకాలం అయింది. మంచం మీదున్న పెట్టెలోంచి శేషగిరిని అడక్కుండానే సిగరెట్టొకటి పైకిలాగి యీజీగా ముట్టించేడు జోగులు. ఆ తరవాత ఇద్దరూ వరాండాలోకొచ్చేరు. శేషగిరి ముఖాన్నిబట్టి, దుర్మార్గం చేసి అయినాసరే జయం సంపాదించి తీరాలనే ఉద్దేశం అతనికున్నట్టు తెలుస్తోంది.

అగ్రిమెంటయేక వరాండాలోకి వస్తూ "నీ కెందుకు శ్రమ ? నువ్వలా గుళ్లో దేవుళ్లా ఆ కొట్లో అలా కాలుమీద కాలువేసుక్కూరో్చ! ముండని మూణ్నిమషాల్లో బుట్టలో వేసుకొచ్చి నీ పాదాల్దగ్గిర కట్టి పడీకపోతే నేను జోగులుగాణ్ని కాననుకో !" అంటూ శేషగిరికి జోగులు హామీ ఇస్తూండగానే, నెత్తిన కంపలతట్ట పెట్టుకొని వెంట ఓ గొర్రెపిల్లని వేసుకొని "పోలిగాడి పెళ్లాం" అటొ్నంచి వస్తూ వాళ్ళని చూసి ఆగింది.

శేషగిరి గుండెలు గబగబా కొట్టుకొంటున్నాయి. ఒక క్షణంపాటు దుర్మార్గపు ముఖంమార్చి, నవ్వు ముఖంలోకి మారాలన్న సంగతి కూడా మర్చిపోయి తరువాత సర్దుకున్నాడు.

ఆమె శేషగిరి నుద్దేశించి,

"ఏంబాబు ? రేత్తిరికి పాలుగాని పడతాయేటి ? సిక్కాటి గేది పాలు ! తెమ్మంటారేటి ?" అని అడిగింది.

ఆమె నలా చూస్తూ మళ్ళీ అలా ఉండి పోయాడు శేషగిరి.

పెద్ద చిత్రకారు డెవరో చిత్రించే డన్చెప్పి ఆ మధ్య ఏదో పత్రికలో ఒక మంచి బొమ్మపడింది. బొమ్మ కింది పేరు శేషగిరికి సరిగా జ్ఞాపకంలేదు. సీతో, సావిత్రో, అరుంధతో ఆ మూడింట్లో ఏదో ఒకటయుండాలి. బొమ్మమాత్రం చాలా బ్యూటిఫుల్‌గా ఉంది. పెద్ద సెక్స్ అపీల్ లేకపోయినా బొమ్మలో ఏదో గమ్మత్తుంది. నెత్తిమీదున్న తట్టతీసేస్తే ఎదురుగా నిల్చున్న "పోలిగాడి పెళ్ళాం" అచ్చంగా ఆ బొమ్మలాగే ఉందనిపించింది శేషగిరికి. ఆ బొమ్మని చూసినప్పుడు గాని ఈ మనిషిని చూస్తోన్నప్పుడుగాని తనలో భక్తిభావం కాని, కనీసం సోదర భావంగాని కలక్కపోవడం గురించి శేషగిరికి ఆశ్చర్యం ఏ మాత్రంకూడా కలగలేదు. మంచి పతివ్రత నెవత్తైనా సెలెక్ట్ చేసి ఒడుపు చూసి ఒకటోరకం టోపీ వెయ్యాలని అతని కప్పటి కప్పుడే చాలా కోరిగ్గా ఉంది.

"ఏంబాబు ? పాలు కావాలేటి ?" అని మళ్ళీ అడిగిం దామె.

పట్నంనించి వచ్చిన ఇంజనీరుగార్ని చూసి ఆమె గుండెలు ఉత్సాహంతో కొట్టుకుంటున్నాయనేది స్పష్టంగా తెలుస్తోంది. "షూర్ సక్సెస్ ! జయం తధ్యం" అనుకున్నాడు శేషగిరి. అయినా, ఎందుకైనా మంచిదన్చెప్పి—వాళ్ళమ్మకి ఫావరేట్ గాడ్, ఇష్టదైవం—తిరపతి వేంకటేశ్వరుడికో నమస్కార బాణం మనసులోంచే విడిచిపెట్టేశాడు. రాబోయే జయలక్ష్మిని తల్చుకోగానే అతనొక్క సారిగా పారిస్, లండన్, న్యూయర్క్ మూడూళ్ళూ ఒక్కసారి చూసొచ్చేసినంత సంబర పడిపోయేడు. ఆ సంతోషంలోనే అతని మనసొక్కసారి చివుక్కు

మంది. "మధ్యవర్తి ప్రమేయం అక్కర్లేకుండానే దీన్తో ఎరేంజిమెంటు కుదిరిపోయేట్టుంది! ఈ వెధవ పింప్‌గాడి గురించి అనవసరంగా రూపాయ్ వేస్ట్ అయింది." ఆ క్షణంలో అతనికి జోగుల్ని చితక పొడిచెయ్యాలన్నంత కోపం వచ్చింది. "వీడికి—ఈ సౌంౘ్రల్ వెధవకి-మరింక సిగరెట్లు బంద్ చేసెయ్యాలి." అని తీర్మానించుకొన్నాడు శేషగిరి.

అంతలోనే జోగులు ఆ మనిషితో "రావే రావే పట్టుకురా! రాత్రికో పావుశేరు పట్రా. ఇంటిదగ్గిర బాగా కాచి మరీ పట్రావాలిస్మీ! మర్చిపోయేవు గనక! బాబు ఈ కొట్లోనే ఉంటాడు. పట్టుకొచ్చిచ్చీ!" అన్నాడు.

జోగులు ఆమెతో ఆ మాటలంటూన్నప్పుడు శేషగిరి ఆమెపై పదే పనిగా చూస్తూ కొకారి నవ్వు నవ్వుతూ నిల్చున్నాడు. ఆ నవ్వుచూసి ఆమె ఒక్క క్షణం ఆశ్చర్యం పడ్డట్టుంది. ఆ తరవాత ఆమెకూ్కడా నవ్వొచ్చింది.

"నాల్రోజులుంటారేటిబాబూ?" అని నవ్వుతూనే అడిగింది. అందుకు సమాధానంగా,

"ఆఁఆఁ! ఉంటాడుంటాడు! నీ కో స ం నాకోసం ఇక్కడ కాపరం పెట్టి కూర్చుంటాడు!" అని వెటకారం చేసేడు జోగులు.

అప్పుడు శేషగిరి అందుకొని, "ఎల్లుండిదాకా ఉంటాను. ఆ తరువాత...." అని మధ్యలో ఆగి చిరునవ్వు నవ్వుతూ, "....చూదాం!" అన్చెప్పి మళ్ళీ ఆగి, "నీ గే దె పా లు బావుంటే ఉండిపోతాను, ఏం?" అని తమాషాగా ముగించేడు. అప్పు డతని ముఖంచూస్తే, మనసులో కల్మషం ఉన్నట్టుగా తెలియనే తెలియదు. ఆ మాటలు అంటూ అతను, చిన్నకూతుర్ని పలకరించే కన్నతండ్రిలా నవ్వేడు.

జయం షూరే అనుకున్నాడు కాని ఆ రాత్రికి మాత్రం అది చేకూర్లేదు శేషగిరికి.

ఆలస్యంగా వస్తుందనుకొంటే ఆమె చాలా వేగిరం వచ్చేసింది. ఆ రావడం కూడా రహస్యంగా రాలేదు. చాలా బాహాటంగా వచ్చింది. వచ్చిన విధంలో కూడా తక్కువా తారుతూ రాలేదు. పుట్టింటికి ఆడ పిల్లొచ్చినట్టొచ్చింది. దాన్తో శేషగిరి గాభరా పడ్డాడు.

ఆ రాత్రి ఏడుగంటల కామె కంచుగిన్నెతో పాలు తీసుకొచ్చి తిన్నగా కొట్లో కిటికీలో పెట్టేసరికి శేషగిరి, పెద్దసైజు కోడిపెట్టని చూసి ఏం చెయ్యాలో తెలియని పిల్లిలా అయిపోయాడు. జడిసిపోని ఆవున్చూసి బెదిరిపోయిన పెంపుడు కుక్కలా అలా పలకరించి ఈర్ష్యగా చూస్తూ నిలబడిపోయే డతను. నాయకురాలికి అపచారం తలపెట్టి, ఆమె ఎదర పడేసరికి బెదిరిపోయిన బంటులా చలనం లేకుండా ఉండిపోయే డతను. కొట్లో నిల్చున్నప్పుడు అక్కడ హరికేన్ లాంతరు వెలుగులో ఆ కొట్టునిండా ఆమే ఉన్నట్టుగా అనిపిస్తోంది, ఆ పల్చటి ధూళిలాటి కాంతిలో ఆమె దర్జాయే ఎక్కువ స్పష్టంగా కొట్టొచ్చినట్టుగా కనిపిస్తోంది. ఆమె కట్టుకున్న బుగ్గిబట్టలు ఆ దర్జాని అడ్డలేకపోతున్నాయి. అమ్మవారి ముందు దొంగభక్తుళ్లా కొంతసేపలా నిల్చున్నాక "నాన్సెన్స్! ఇదే రాణీలాగా నేనే సర్వెంట్ లాగా నిలబడిపోవడం ఏ(వి(టి!" అనుకొని ఆమెనలా నిలబడనిచ్చి తను మంచంమీద ఠీవిగా కూర్చున్నాడు శేషగిరి. "కుర్చీమీద కూర్చున్న వాడికి ఎదర నిలబడ్డ వాడెప్పుడూ లోకువనే సంగతి మర్చిపోకు." అని తన తండ్రి చెప్పిన పాఠం గుర్తుకొచ్చిం దతనికి.

ఆమె అక్కడ కిటికీలో ఉన్న అద్దం, షేవింగు సెట్టు, సబ్బు పెట్టె, అన్నీ సవరించి చూస్తోంది. అద్దంలో తన ముఖం చూసుకొని

చాలా ఆశ్చర్యపోయి, "ఆదెవురో అనుకున్నాను!" అంది. పక్కనే బొక్కి కుర్చీలో ఉన్న కేమెరాని చూసి చాలా ఆశ్చర్యపడింది. ఆమె అదలా చూస్తూన్నప్పుడు ఆ మె కో స్నాప్ తీసి "ఒక పల్లె పిల్ల" అన్చెప్పి ఫొటో కాంపెటీషన్కి పంపించి ప్రయిజు కొట్టవచ్చేమోననే ఆశ కలిగింది శేషగిరికి. "ఫొటొ తీయించుకుంటావా?" అనడిగితే ఆమె మాత్రం "ఓలమ్మొ, నాకొద్దు" అనేసింది. కేమెరా పరీక్షించేక "నీ సేతికి వోసీ నేదా?" అని అడిగి అతని చేతినున్న వాచీ ఖరీదడిగి "అన్ని రూపాయలే!" అని గుండెలు బాదేసుకొంది. ఉన్న అరగంట లోనూ "ఏశెంతయింది ?" అని ఆరు సార్లడిగి తెలుసుకొంది. తాతా వారి వాసన్నూనె చూసి "ఏటిది ? నూనే!" అని ముచ్చటపడి పోయింది. సబ్బు పెట్టెలోంచి సబ్బు తీసి వాసన చూసి చాలా మురిసి పోయింది. స్నో సీసా పౌడరు డబ్బా తీసి, వాటి గురించి తెలుసు కొని, "ఇయన్నీ మొగోళ్ళ కెందుకూ ?!" అంటూ అతణ్ని విడ్డూ రంగా చూసింది. "నీకు పెళ్ళయిందా ?" అని ప్రశ్నించి, "నచ్చ రూపాయ్లు కట్టఁ విస్తేగాని ఉచ్చుకోవుట! అంత సదువు సదివినావు గందా! నీకూ ఆడోళ్ళ సొమ్మే గావాలా ?" అని ముద్దుగా చేతులు తిప్పుతూ చీవాట్లు పెట్టింది ? కొట్లో శేషగిరి తాలూకు సామాను మొత్తం ఖరీదు తెలుసుకొని, అంత డబ్బు మిగల్చాలంటే "మాయి మూడు కుటుంబాలు ముప్పొద్దులా ఎంత కష్టఁవెన్నాళ్లు బడాల?" అని ప్రశ్నించింది. "పట్టంలో ఆడోళ్లుగూడా పెద్ద పెద్ద సదువుల్సదివి టూరింకార్లు తిప్పుకుపోతారట! నిజవేఁనా ?" అని చాలా కుతూహలం కనపరుస్తూ అడిగింది. "శృంగార హాస్యధోరణి"లో శేషగిరి "నువ్వూ చదువుకోకూడదా ?" అని అంటే, "మాకు బువ్వే నేదు కదా! సదువుల కెగబడగలవాఁ ?!" అంది. "నీ సదువు కెంత కర్స యింది ?" అని అడిగి, "మరా సదువు మాఁవెలా సదవగలం ?

నిజంగా సదవగలవాఁ ?" అంది. "ఒంతిన్లూ, ఇమానాలూ కడతావట గదా! మరైతే అయన్నీ నువ్వే సొంతంగా కడతావా ?" అనడిగింది. "ఓహో! మా బుగతల్లా నువ్వూ దగ్గిరుండి, మాలాటోళ్ళ కూ్కలిచ్చి పన్లు పురమాయించడవేఁగాని సొంతంగ ఏటీ సెయ్యవన్న మాట ?" అని సంగతి తెలుసుకొంది. "ఇమానా లెందాకా ఎల్తాయి ? సుక్కల్దాకా ఎల్తాయా ? సుక్కలంటే ఏటయి ? అందులో ఏటుంటంది ? నువ్వెప్పుడైనా ఎగిర్నావా ?" అంటూ "చికాకు ప్రశ్నలు" ("సిల్లీ క్వశ్చన్స్") చాలా వేసింది. "విమానం ఎక్కిస్తానొస్తావా ?" అని అతను తన బుగ్గమీద వేళ్ళతో పెంకెతనంగా కొడితే, అతణ్ని చాలా ఆశ్చర్యంతో విడ్డూరంగా చూసి, "బేగి పాల్తాగేసి ముంతిచ్చీ బాబూ ! నాను బేగి పోవాల" అంటూ తొందర చేసింది. "మళ్ళీ రేపు పాలు తెస్తావా ?" అని అడుగుతే, "తెమ్మంటే ఎందుకు తేనూ ?! అని ఆశ్చర్యపోయింది. చివరకి వెళ్ళిపోయింది.

ఆసారికి తనేమీ చెయ్యలే పోవడం చేత "లలిత రాస్కెల్లాగే" ఈ పిట్ట కూడా తప్పిపోతుందేమోనని శేషగిరి గిజగిజ లాడిపోయేడు. మర్నాటి ఉదయమూ మధ్యాహ్నమూ ఆమె వచ్చినప్పుడు ఆమెని కొంత మంచి చూపించి మచ్చిక చేసి చనువు చేసి ఆమె యెడల కొంత చొరవ చూపించేడు. దాన్తో అతని కళ్ళల్లో మిలమిల ఎక్కువయింది. రక్తంలో తొందర కూడా ఎక్కువయింది. సాయంకాలం ఆమెతో మాటాడుతూ దీనంగా "మళ్ళీ ఒస్తావా ?" అనడిగేడు. "పాలొట్టుకొస్తాను గదా !" అందామె. "అప్పుడు రావడమే కాదు. ఆ తరవాత రావా ?" అని ఇంకా దీనంగా, అన్నం పెట్టమని తల్లిని కొడుకు అడిగినట్టుగా అడిగేడు. ఆమె అతణ్ని చూసి చాలా నవ్వుకుంది. "ఎందుకలా ఏడుపు మొకం ఎట్టుకున్నావు ? పోన్లె! మాపిటి కలాగే సూత్తా" నంది. "బాబు శానా మంచోడు!" అని ఆమె మన

సులో అనుకున్నదని శేషగిరికి తెలిస్తే, ఆమె వెళ్ళేక. ఇంకా రెండిం తలు ఎగిరి గెంతుండు నతను.

చలికి రాత్రి చాలామంది ముసుగులు తన్ని పడుకున్నట్టు న్నారు. శేషగిరి మాత్రం కొట్లో మంచంమీద కూర్చొని పులికళ్ళు ఎరువు తెచ్చుకొని రెక్కలు తెరిచుంచిన ద్వారంవైపు పొంచి చూస్తు న్నాడు. అతి చలిగా అతి చీకటిగా కొట్టంతా కూడా పాము కడుపులో మునిగినట్టుంది. ''దొంగ ముండ, ఒస్తుందా, రాదా ?'' అని పళ్ళు కొరుకుతూ కూర్చున్నాడు శేషగిరి.

అంతలో చీర చప్పుడయింది. లేచి నిల్చున్నాడు శేషగిరి.

ఆమె వచ్చి గుమ్మంలో నిల్చుంది. పటం కట్టిన దేవత బొమ్మ చీకట్లో కనిపించినట్టుగా నిలబడిపోయిందామె.

శేషగిరి ఒక్కక్షణం అలా ఉండిపోయి, వెంటనే జరజర కది లేడు. అతని ప్రతి కదలికలోనూ ఆశా, తొందరపాటూ కనిపి స్తున్నాయి. ఆమె మనసు మార్చుకొని తిరిగి ఎక్కడ వెనక్కి పారిపో తుందేమోనని అతనికి భయంవేసి, గభాల్న ఆమెని లోనికి లాగి తలుపు వేసేసి, బండరాయివారకి నక్క మాంసం ముక్కని లాక్కు పోయినట్టు వారనున్న మంచం దగ్గిరికి లాక్కుపోయే డామెని. ఆమె రాగానే కొట్టంతాకూడా వెచ్చగా అయినట్టయింది. చైత్రంలో తొలక రించగానే భూమిలోంచి వాసన్లు చిమ్మినట్టు, అమె వచ్చీరాగానే కొట్టంతా మనోహరమైన మట్టి వాసనతో నిండిపోయింది.

శేషగిరి చాలా సేపట్నించి చలికి వరడుకట్టేసున్నాడు. ఆమె దగ్గరకి చేరగానే సుఖంగా చలిమంట దగ్గిర కూర్చున్నట్టనిపించిం దతనికి. ఆమె వళ్ళంతా ముఖమల్లాగ మెత్తగానూ, పండులాగ గట్టి గానూ కూడా ఉంది. ఆమె అరిచేతులు మెత్తని ఆకురాళ్ళల్లా ఉన్నాయి.

ఆమె చాలా ఆరోగ్యంగా ఉన్నట్టనిపించినా నిజానికి ఆమె ఎండకి వాడిన సువర్ణ రేఖలా ఉందన్న సంగతి అతను గమనించలేదు. అతనా సమయంలో చాలా కసిగా క్రూరంగా కూడా ఉన్నాడు. అర్హత లేని గుమాస్తాని అకస్మాత్తుగా జిల్లా కలెక్టర్‌గా చేసేస్తే వాడి కందర్నీ కాల్చుకు తినేయాలనుకున్నట్టు శేషగిరి కామెని గమ్మత్తుగా హింసించాలనే కోరిక కలిగింది. ఆమెయందు పర్మనెంటుగా, పూర్వం బానిసలకి ముద్ర వేసినట్టు, తన మార్కేదైనా ఉంచాలనిపించిందతనికి. ఆమె ఎక్కడ కెళ్ళినా "ఇది గిరిగారి సొమ్ము!" అని తెలిస్తే టెరిఫిక్ తమాషాగా ఉంటుంది!

ఆ రాత్రి చీకటి కొట్లో ఆమె మనసులో ఆశా, ఆనందం కలిసి వారధుల్ని దాటాలనీ, ఆమె కళ్ళు వెలుగుల్ని చూడాలనీ తహతహ లాడ్డం తెలుసుకోలేని చీకటి తృష్ణలో ఉన్నాడతను. మేడ మేడకీ చంద్రుడు, మిద్దెమిద్దెకీ చుక్కల ముగ్గులు, నెలనెలా పండే పచ్చటి పొలాలు, అనుకోగానే అడిగిందల్లా ఇచ్చే మరమెషిన్లు, కలకల్లాడే ఇస్కూళ్ళకి వెళ్ళే తల్లుల పిల్లల బారులు, కొండలనించి కొంపలకెళ్ళే వంతెన్ల వీధులు, లోయలో చల్లగాలిలో పొద్దున్న పూసిన పువ్వులు, రెక్కలొచ్చి ఎగిరే చక్కని చుక్కలు — ఎన్నో చిత్రాలు, స్వేచ్ఛనీ ఆనందాన్నీ సూచించే ఎన్నెన్నో దృశ్యాలు చూడాలని ఆమె ఆవేదన పడుతోందన్న విషయం అతను గమనించనే లేదు. కనీసం ఆమె ఏమాలోచిస్తోందో అడిగి తెలుసుకుందామనే కుతూహలమైనా లేక పోయిందతనికి. తనని కానేకాదు, తను సూచించే స్వేచ్ఛామయ జీవితాన్నామె ప్రేమిస్తోందన్న విషయం అతనికి చెప్పినా అర్థం కాదది. కొట్లోకి రానిచ్చేదేకాని, తన జీవితంలోకి మాత్రం ఆమెని రానివ్వకుండా జాగ్రత్త పడాలనే విషయం మాత్రం ఎవ్వరూ ప్రత్యేకంగా

చెప్పకుండానే, ఖచ్చితంగా తెలుసు నతనికి. ఆమ్మెని ఆకర్షించి పాడు చేస్తున్నాననే భావంగాని, ఆమెనీ ఆమె పెనిమిట్నీ దగా చేస్తున్నాననే భావంగాని, పాపం చేస్తున్నానేమోననే భయంగాని అతనికి ఎంత మాత్రం లేకపోయింది.

నిద్రలోంచి లేచినట్టుగా లేచి చివరకామె వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళేక ఆ రాత్రి, అవతలవాడి ఖర్చుమీద సుష్టుగా భోంచేసిన వాళ్ళా, సుఖంగా నిద్రపోయేడు శేషగిరి.

అదంతా జరిగి పధ్నాలుగు సంవత్సరాలయింది.

గుడ్ గాడ్ ! పధ్నాలుగేళ్ళయిందా ?

అనుకున్నాడు శేషగిరి. అతనికి రోజులు చాలా తొందరగా వుడ్‌హవుస్ నవల్లో పేజీలు తిరిగిపోయినట్టుతిరిగి పోయేయి. ఆలిండియా పోటీ పరీక్షల్లో అతను అతి సులభంగా అయిదో స్థానం సంపాదించేడు. సంపాదించి, ఉద్యోగంలో చేరేడు. చేరినప్పుడే, సీనియారిటీ వగైరా విషయాలన్నీ చక్కజూసు కున్నాడు. చక్కజూసుకొని అనతికాలం లోనే ఎగ్జిక్యూటివ్ ఇంజనీరయేడు. అయేక, మరింక ముందుకి చీఫ్ ఇంజనీరవుతాడు. అవకుండా అతణ్ని దేవేంద్రుడు డాపలేడు. "లంచం" అనే ముద్ర పడకుండా డబ్బు సంపాదించడం నేర్చుకున్నా డతను. "పన్లో మాత్రం పులి" అనే బిరుదు సంపాదించేడు. హైసొసైటీలో తిరిగినప్పుడు తాక్కపోతే ప్రమాదం అని తెలుసుకోగలిగిన చదువు కున్న పెళ్లాం ఉందతనికి. సర్వెంట్స్‌తో కూడా తెలుగున మాట్లాడ్డం ఎరగని ముత్యాల్లాటి ముగ్గురు పిల్లలున్నారతనికి. జీవితం అంతా లండన్ మాంచెస్టర్ వెళ్ళినట్టే శేషగిరిక్కూడా. పది మిలియన్ డాలర్ల పంచరంగుల చిత్రంలా వెళ్తుందనడంలో ఎంత మాత్రమైనా ఏ సందేహమైనా లేదంటే లేదు.

పధ్నాలుగేళ్ళయిందా ? !

అయింది కాని అవనట్టే ఉంది. ఆ వూరు వెళ్ళి ఆ రాత్రి జరిగిన దంతా "మొన్న మొన్ననే అయినట్టుంది" అనుకున్నాడు శేషగిరి, మళ్ళీ అగ్రహారానికి వెళ్తూవెళ్తూ. దారిపక్క ముసిలి చెట్లని చూస్తే తప్ప కాలం మారినట్టుగానే కనిపించడంలే దతనికి.

అసలుకి, మళ్ళీ ఆవూరు వెళ్ళవలసొస్తుందని కలలోనయినా అనుకోలే దతను. ఈశ్వరయ్యా ముప్ఫయ్యేళ్ళా జకరయ్యా ముప్ఫయ్యయిదేళ్లా, సుబ్బారాయుడుపంతులు నలభయ్యేళ్ళా "కాలుమీద కాలు వేసుక్కూర్చొని వేలకి వేలు పెన్షన్ సంపాదించేరు." అలాటిది, రిటైరయేక పదేళ్ళయినా అవకుండానే (!) శేషగిరి తండ్రి కాలం చేసేడు ! అందుగురించి చేసేదేముంది ? చేసేదేమీలేక అందరూ ఊరుకున్నారు. "మీ హెల్త్ మీరు జాగ్రత్తగా చూసుకోవాలిస్మండి !" అని తండ్రికి శేషగిరి చాలాసార్లు వార్నింగ్ ఇచ్చేడు, "ముసలాడు" ("ది ఓల్డ్ మాన్") విన్నాడు కాడు. తండ్రి ఆరోగ్యం గురించి అతనంత శ్రద్ధ తీసుకుంటే "వీడి శ్రద్ధంతా ఆ పెన్షన్ గురించేకాని ఫాదరు హెల్త్ గురించి కాదు" అన్చెప్పి కొంతమంది కిట్టని రాస్కెల్సు దుష్ప్రచారం చేసేరు. శేషగిరికి వాళ్ళందర్నీ కాల్చేసి చంపేయా లన్నంత కోపం వచ్చింది. "సరే ! నాకు ముసిలాడక్కర్లేదు. వాడి పెన్షనే కావాలి, దానిగురించి, ఇడియట్స్, మీరేం చెయ్యగలరు ?" అని మనస్సులో మండిపోయేవాడు శేషరిగి. జీవితంలో ఏ వెధవ గురించీ కూడా శేషగిరికి లెక్కలేదు.

తండ్రి చనిపోయాక, ఆస్తి విషయాలన్నీ సెటిల్ చేసుకొని సరైన అరేంజి మెంట్సు చేసుకొందికి కాకినాడ వచ్చేడు శేషగిరి. తమకో రెండెకరాల పొలం—ఎలాగో ఎప్పుడో ఎవరివల్లనో సంక్ర

మించినది—ఆ వెధవ అగ్రహారంలో ఇన్నాళ్లూ ఫాదరు దాచుంచేడన్న సంగతి అప్పుడు తెలిసిందతనికి, సరే బాగానే ఉంది, కాని మారుమూల కుగ్రామంలో రెండెకరాల "బిట్టు" ఏం చేసుకోడం ? ఎందుకు పని కొస్తుందది ? అమ్మిపారేసి ఆ డబ్బెందులోనైనా ఇన్వెస్ట్ చేసుకోడం బెటరు. అమ్మేస్తే ఆ పొలం చెక్క ఎవడైనా కొంటాడా అని శేష గిరి ఉత్తరం ఒకటి రాసేడు కామేశానికి. వాడు నిర్లక్ష్యంగా జవాబైనా రాయకుండా ఊరుకున్నాడు. పెద్దవాళ్ళకి తమ అవసరం ఉందంటే తక్కువ్వెధవ లిలాగే కొండెక్కి కూర్చుంటారు.

అందుచేత శేషగిరే స్వయంగా బయల్దేర వలసొచ్చింది. కార్లో ఈజీగా వెళ్లొచ్చేవచ్చు, కాని ఇట్ ఈజ్ సచ్ ఏ బోర్ !

పథ్నాలుగేళ్ళ తరవాత అగ్రహారానికి మళ్లీ వెళ్తాంటే శేషగిరికి ఆ మనిషి—"దట్ బిచ్"—గుర్తుకొచ్చింది. అక్కడుంటుందా ? ఉంటే ఓసారి చూడొచ్చు. పాత పరిచయాలు పసందుగా ఉంటాయంటారు.

జీవితం చాలా గమ్మత్తుగా ఉంటుం దనిపించింది శేషగిరికి. దాన్ని మళ్లీ చూడ్డానికి అవకాశం ఉంటుందనిగాని మళ్లీ ఆ వెధవ్వూరు తను వెళ్ళవలసొస్తుందనిగాని శేషగిరి ఎన్నడూ అనుకోలేదు. కాని, జీవితం చాలా విచిత్రంగా ఉంటుంది. లైఫ్ ఈజ్ స్ట్రేంజ్ ! ఇదే సామ ర్సెట్ మామ్ అయితే ఈ థీమ్మీద అరజడను కథలు రాసిపారేగలడు, మోస్ట్ బ్యూటిఫుల్‌గానూ, బోర్ కొట్టకుండాను !

తనక్కడికి వెళ్తాడు. ఆ మనిషి అక్కడే ఉంటుంది. "రా పిల్లా !" అంటాడు. ఆ పిల్ల స్ట్రేంజ్‌గా నవ్వుతుంది. "రాత్రి కని పించు" అంటాడు. ఆ పిల్ల ఆశ్చర్యపోయి నిలబడి పోతుంది. కాని రాత్రికి ఖచ్చితంగా ఒస్తుంది. "గుర్తు పట్టనట్టు నటించేవేం ?" అంటాడు. "నాకు గుర్తులేదు" అంటుందాపిల్ల. "అబద్ధం" అంటాడు.

"కాదు నిజం" అటుంది. అందులో గమ్మత్తేమిటంటే ఆ పిల్ల నిజమే చెప్తోంది. ఆ పిల్ల పాత పిల్ల కాదు. పాతపిల్ల కూతురు !

తనక్కడికి వెళ్తాడు. ఆ మనిషి అక్కడే ఉంటుంది. "రా, రాత్రికి !" అంటాడు. ఆ మనిషి స్ట్రేన్జ్‌గా నవ్వుతుంది. నవ్వి, "ఎందుకురానూ !" అంటుంది. రాత్రికి హడావిడిగా ఒస్తుంది. "బావున్నావా బాబూ ?" అంటుంది. "బాగున్నాను బా గు న్నా ను అంటాడు." "ఏ డా ద యి ం ది. ఇన్నాళ్ళూ ఎందుకు రాలేదు ?" అంటుంది. "ఏడాదికాదు. పథ్నాలుగేళ్ళయింది ?" అంటాడు. "ఒస్ ! నువ్వు ఇంజనీరు బాబువా ?! ఆ మధ్యొచ్చిన డాక్టర్ బాబనుకున్నాను" అని ఆ మనిషి కలకలా నవ్వుతుంది.

తనక్కడికి వెళ్తాడు. ఊరంతా అల్లకల్లోలంలో ఉంటుంది. ఆ మనిషి అక్కడందరికీ నాయకురాలిగా ఉంటుంది. భూస్వాములంతా ఆ మనిషిన్చూసి బెదిరిపోతుంటారు. రాత్రికి కత్తూలూ ఈటెలూ పట్టుకొని అటూ ఇటూ నిలబడుంటారు. తనక్కడికి వెళ్తాడు. ఆ మనిషి తనని చూస్తుంది. "ఆ భూస్వామి బంగారు కూతురు" అని ఓ అమ్మాయిని ఆ మనిషికి చూపించి "ఇది నా భార్య !" అని చూపిస్తాడు. ఆ మనిషి తననుచూసి కరిగిపోతుంది. ప రి శు ద్ధ మై న ప్రేమ వర్గద్వేషాన్ని ("క్లాస్ హేట్రెడ్‌ని") జయయిస్తుంది. (?, "కత్తూలూ కటార్లూ అంతా కిందపడేయండి"అని అరుస్తుంది. రైతులంతా పిల్లులయిపోతారు. "ప్రేమ ఎంత పవిత్రమైనది !" అని చెప్పగలమా దీన్నిబట్టి ? చెప్పలేం. చెప్పగలిగినదల్లా ఈ జీ వి త ం చిత్రమైనదని మాత్రమే. రక్తాలు పారకుండా యుద్ధాన్ని ఆపేసి ఆ మనిషి అతని భార్యని మాత్రం చంపేసింది !

బ్యూటిఫుల్ ! బ్యూటిఫుల్ ! శేషగిరి గొప్పరైటరు ! లక్షల మీద రాబడి !

అగ్రహారానికని బయల్దేరే ముందు ఎందుకైనా మంచిదని సామర్సెట్ మామ్ కథల పుస్తకం ఒకటి కార్లో పడేసుకున్నాడు శేషగిరి.

కార్లో ప్రయాణం సాఫీగానే సాగుతోంది. రోడ్డు నాట్ బేడ్ ప్రజలింకా అలానే ఉన్నారు. రోడ్లు మాత్రం కొంచెం బాగుపడ్డాయి. వెధవలకింకా రోడ్‌సెన్స్ లేదు. అడ్డుగా రావడం, పొగరుబోతుగా చూడ్డం! గుడ్‌నెస్ గ్రాషస్! పూర్వం ఇలా లేదు. దేశం ఏ దారంట ఎక్కడికి పోతుందో అర్థం కావడంలేదు. డ్రయివర్ని లాక్కు రావల సిందేమో. ప్రమాదం జరిగితే కాస్త అడ్డుగా ఉన్నా!

కారు ముందుకి బాగానే వెళ్తోంది. అగ్రహారం జంక్షన్ అదేనా? నాలుగు షాపులు, పదిమంది బెగ్గర్సు—సరంజామా అంతా ఉంది.

కాని అంతలోనే —

డామిట్!

కారు చెడింది. వాట్ ఎ న్యూసెన్స్!! కారుని ఇంగ్లీషులో మోటుబూతులు తిట్టేడు శేషగిరి, "బారక్ రూమ్ లాంగ్వేజ్??" ఎస్! అంతే! మరేం గాభరా పడకండి. ఈజిప్టు వ్యవహారంలో ఈడెన్‌గార్ని ఐక్‌మన్‌గారు అలాగనే మర్యాద చేసేరట.అంతటి వారే అలా చేసినప్పుడు పూర్ పెటీ ఇండియన్ ఎలా తిడితేనేం?

మధ్యాహ్నం ఒంటిగంటయింది. వేసవికాలం అవడంచేత వడ గాలి తీవ్రంగా ఉంది. తిట్టుకుంటూ, విసుక్కుంటూ కార్లోంచి బైట కొచ్చేడు శేషగిరి. చేత్తో తోలుసంచీ ఒకటి పట్టుకున్నాడు. కారొక వారకి ఎలా తొయ్యడమా అనే ఆలోచన ఇంకా రాకుండానే జంక్షన్ దగ్గర దుకాణాలజనం చుట్టూ పోగయి "కారు ఇక్కడ పెట్టండంటే

ఇక్కడ పెట్టండ"ని పెద్ద ఉపకారం చెయ్యడాని కొచ్చినట్టొచ్చి (!) కారో వారకి తోసి, ఆ తరవాత ఎవరిమానానవాళ్ళు పోకుండా "బాబు గారి దేవూరో ? ఏం పనో ? ఎక్కడకెళ్తారో ? ఏం పనిమీదో ?" అంటూ ప్రశ్నలువేసి న్యూసెన్స్ క్రియేట్ చేసేరు. "అగ్రహారం ఎంతదూరం ఉంది ?" అని అడుగుతే "రెండు కోసుల్లు" అని నాలుగు గొంతుకలు పలికేయి. కారుమొహం సరిగా ఎరగని జనం ! "ఏయ్ ! దూరంగా ఉండండి ! ముట్టుకోకండి !" దుకాణదారు దొకడు ముందు కొచ్చేడు. "ఓయ్ ! ఈ రూపాయుంచు ! మళ్లీ ఒస్తాను. కారు జాగ్రత్తగా చూడు !" రూపాయిదండుగ ! కారుకేం రిపేరో ఏమిటో ? అదో దండగ ! ఇప్పుడు అగ్రహారం ఎలావెళ్లడం ? ఎలా రావడం ? చూదాం! నాలుగు మైళ్ళు ఉందన్నారు! ఎలా వెళ్ళడం ? వెళ్లాలంటే ఓ బండీ లేదు, రిక్షా లేదు, కనీసం ఓ చెడిపోయిన సైకిలైనా లేదు. వెళ్ళీ వెళ్ళగానే కామేశాన్నీ, ఆ రైతెవడో వాణ్నీ పిలిపించి ఈజీగా ఓ పూటలో వ్యవహారం అంతా సెటిల్ చేసేదాం అంటే అలా కుదిరేట్టులేదు. రాత్రికి అక్కడ ఉండిపోవలసొచ్చేట్టుంది. ఇంతకీ, అనుకున్నంత ఈజీగా అంతా సెటిలవుతుందో అవదో! ఏదేమైనా, కనీసం ఆ మనిషయినా కనిపించకపోతే, రాత్రంతా డల్‌గా ఉండిపోవలసుంటుంది.

టోపీ ఒకటి నెత్తికి నొక్కుకొని, చలవ కళ్లజోడొకటి పెట్టుకొని, "సర్కారు మొహం" ఒకటి ముఖానికి తగిలించుకొని అగ్రహారంవైపు నెమ్మదిగా నడక సాగించేడు శేషగిరి.

వేసవికాలం. ఎండ దంచేస్తోంది. ట్రంకు రోడ్డు బావుంది కాని "ఈ సైడు రోడ్డు ఛండాలంగా ఉంది" నడిచినకొద్దీ రబ్బరు సాగినట్టు సాగుతోంది. రోడ్డుమీద రాళ్లూ లేవు, కంకరా లేదు, ఇసకా లేదు, అన్నీ

కలిసి మిల్లులో మెత్తగా ఆడించిన పిండిలా అయిపోయేయి. కొండ వారనించి వచ్చే ఈదురుగాలి ఆ దుమ్మునంతట్నీ లేపుకుపోతూ పక్క నుండే చెట్ల ఆకుల నిండా రంగు పూసినట్టు పూస్తోంది. ఆ చెట్లన్నీ అదోరకం జబ్బుతో బాధపడుతున్నట్టున్నాయి. వర్షాలు పడి ఎన్నో నెల లయినట్టుంది. అడ్డులేని ఫాసిస్టు డిక్టేటర్‌షిప్‌లా మండుటెండ ప్రతి వస్తువునీ ప్రతిమనిషినీ కాల్చుకు తినేస్తోంది. "గాడ్ ! ఎండ చాలా ఘోరంగా ఉంది!" అనుకున్నాడు శేషగిరి. అతను తొడుక్కున్న బూట్లు మెత్తటివీ, మంచివీ, ఖరీదువీ అయినప్పటికీ వాటికి దూరపు నడక అలవాటు లేకపోవడంచేతో ఏమో అవి అతని పాదాన్ని పట్టుకు నొక్కుతూ నిరసన తెలియజెయ్యడం మొదలు పెట్టేయి. రోడ్డంతా కనుచూపు మేర నిర్మానుష్యంగా ఉంది. కోటబురుజు మీద ఇనప సిపాయిలా ఆకాశంలో ఓ గెద్ద ఎత్తున గస్తీ తిరుగుతోంది. రెండు చిలకలు కాబోలు, ఓ మామిడి చెట్లో భయంతో గుసగుసలాడు కొంటు న్నాయి.

ఆవేల్టి మనిషి. ... పధ్నాలుగేళ్లయి పోయింది..... గడ్డివాసన, మట్టి వాసన, పిడకల వాసన, చెమట వాసన.... ఛండాలంగా ఉంది.... కాని, దొంగముండ బాగానే ఉంది.... మిక్స్చర్ ఆఫ్ ఆపోజిట్స్!.... దాన్నే "మాలిన్యంలో మాధుర్యము" అంటారు కాబోలు మన తెలుగు పోయట్ స్కౌండ్రల్సు . బ్లడీ బిచ్ ! మళ్లీ కనిపిస్తే బావుణ్ను.... చాలా రోజులయిపోయిందికదా ! డొక్కులా అయిపోయిందేమో ? ! నో ! నో ! నోపెసిమిజమ్ ప్లీజ్ ! ఎల్లప్పుడూ చీకటినే చూడకు ! ఆల్వేస్ హోప్ ఫర్ ది బెస్ట్! సదా (ఎల్లప్పుడూ) మంచినే ఆశిం చుము.

అనుకొంటూ శేషగిరి వెళ్తూంటే కొంత దూరం దాటేక , అతని కెదురుగా, కొంత దూరంలో రెండు చీరలు కనిపించేయి. చెరో

చీర నెత్తిమీదా చెరో తట్టా ఉంది. చీర లెలా వుంటేనేం ? చీరల్లో చిలకలు బావున్నాయా ? అని చూసేడు శేషగిరి.

అతనలాచూస్తూ ముందుకి వెళ్తుంటే వాళ్ళు కూడా అలా అతన్నే చూస్తూ ఎదురుగా వస్తున్నారు. వాళ్లు కొంచెం దగ్గిరవగానే,

"గుడ్ గాడ్;" అనుకున్నాడు శేషగిరి.

సందేహం లేదు. అదే హైటు. అదే గుండె, అదే నడుం, అదే మనిషి! ఏ(వి(టీ అదృష్టం! కొంచెం వాడిందంతే! అంతకిమించి ముండ చెక్కు చెదర్లేదు. జర్నీ బోరింగా ఉన్నదనుకొంటే, ముళ్ళ డొంకలో మల్లెపువ్వ మళ్ళీ కనిపించిందే! బ్యూటీ! అందుకే నిరాశ చెందకూడ దన్నారు పెద్దలు! దేవుళ్ళేడూ ? ! (అ(గహారంలో ఉండే ఆడపిల్లలు) అ(గహారంలో ఉండరూ ? !

అని నవ్వుకున్నాక,

అయామ్ థర్టీ ఫైవ్! ముప్ఫయ్యయిదేళ్ళున్నాయి నాకు! ఇంకా ఇంకా జువెనైల్ అఫెండర్లా, బాల నేరస్తుళ్ళా ఆలోచిస్తున్నానే?

అని ఆశ్చర్యపోయేక,

"వై నాట్ ? ! ఎందుకూ్కడదూ ? !"

అని సమాధాన పర్చుకున్నాడు శేషగిరి.

దొరలా, ఎ(రగా. ఆఫీససర్లా దర్జాగా వున్న ఆ కొత్త మనిషి కళ్ళజోడు కళ్లు మరతో తిప్పినట్టు తనవైపే తిప్పి ఉండడం చూసి చిన్నమ్మికి "తొత్తబయం" వేసింది. అంతలోనే! అతనలా చూడ్డం వింతగా తోచింది. తోచడంతోనే ఆమెకి నవ్వొచ్చింది.

వాళ్ళు బాగా దగ్గరకి రాగానే దొర మొహం మార్చేసి, కన్న తం(డి మొహం తగిలించేసుకుని ఆ ముఖాన్ని మంచి చిరునవ్వుతో 'ఛార్మింగ్"గా వెలిగించేసుకొని, చిన్నమ్మి వైపు చూస్తూ,

"ఏమే! బావున్నావా?" అని శేషగిరి పలకరించేడు.

అతనలా వెలుగు వెలగడం చూసి చిన్నమ్మికి మరీ నవ్వొచ్చింది.

"చాల్రోజులయింది. నీ పేరు మర్చిపోయేను" అన్నాడు శేషగిరి.

"ఏమో! ఒవుర్ని జూసి ఒవురను కొంటన్నావో ఏటో!" అంది చినమ్మి.

పక్కనున్న "ముసలిముండ" తననో దయ్యంలా చూడ్డం గమనించేడు శేషగిరి. అత్తగారో ఆడబడుచో అయుండాలి. ఆ ముండని చూసి ఈ పిట్ట భయపడుతున్నట్టుంది. అందుకే ఏం తెలియనట్టు నటిస్తోంది, మనం కూడా డిస్క్రీట్‌గా ఉండాలి.

"ఎక్కడో చూసేనని పొరపాటు పడ్డాను, నీ పేరేవిఁటి ?"

"నా పేరా ?" అంటూ చిన్నమ్మి బారుగా నవ్వింది. వయసొచ్చినా ఆమెలో చిలిపితనం పోలేదు. నవ్వినప్పుడు ఆమె బుగ్గ చిల్లులు షోగ్గా కనిపిస్తున్నాయి. పలువరస ముత్యాల వరసలా కనిపిస్తోంది. గుండెలు బంగారబ్బుంగల్లా రాపాడుతున్నాయి.

"మా లాటి మోటోళ్ల పేర్లు బావుండవు. సెప్పకూడదు" అంది నవ్వుతూనే.

శేషగిరి కొంచెం చిరాకు పడ్డాడు. "బిచెస్‌కి లీనియన్స్ ఇచ్చి కూడదు!" అనుకొని డ్రమెటిగ్గా కంటిమీంచి చలవ కళ్లజోడు తీసి, సీరియస్‌గా రుమాల్తో దాన్ని తుడిచి, అది మళ్లీ కళ్లకు పెట్టుకొని, ఒకసారి ఆకాశంలోకి చూసి, అప్పుడా ఇద్దరాడవాళ్లనీ కొంచెం గంభీరంగా చూసేడు. ఆ రెండో ముండ తనను బందిపోటు దొంగలాగా బ్రహ్మరాక్షసుల్లాగా చూస్తున్నట్టనిపించిందతనికి. ఆ మనిషిని చూపించి,

"ఆ మనిషెవరు?" అని అడిగేడు.

"మా యప్ప" అంది చిన్నమ్మి.

"సరే వెళ్ళండి! ఏ వూరు మీది?"

"అగ్గురోరం" చిన్నమ్మే జవాబిస్తోంది.

"ఐసీ! కామేశంబాబు బావున్నాడా?"

"అంటే లలితమ్మగోరి అయ్యేనా?"

"అతనే!"

"బావున్నాడా అంటే ఏం జెప్పడం బాబు? బతికున్నాడు! అదే బాగు! పొద్దల్లా ఎర్రాళ్ళా అరుగుమీదే కూకుడుంటాడు. మొన్న కడ సారపో ళ్ళిద్దరూ పోనారుగదా! ఆదెబ్బతో మరీ లెగనేకండా అయి పోనాడు. ఏం? ఆ బాబు, నీ క్కావలసినోడా?"

"ఆఁ! కావలసినవాడే!" అన్నాడు శేషగిరి.

"కావలసినోడయితే, మరి నీకు తెల్దా? మమ్మల్నడుగుతా వేం?"

"సర్లే సర్లే! వెళ్ళు! కాని.........లలితమ్మ బావుందా?" అని అడక్కుండా ఉండలేకపోయేడు శేషగిరి.

"ఏం బాగు! ముండమోసి ఇంటికాడున్నాది. కొడుకుజూస్తే గుడ్డోడు. తండ్రి జూస్తె లెగనేడు. మరింక కూడు తిందారంటె కుండ లున్నాయిగాని అందల గింజల్నేవు. ఇంకేం బాగు?! మా యప్ప బతుకులాగే ఆయమ్మ బతుకూను!"

శేషగిరి విసుక్కున్నాడు. కామేశంగాడు తన పొలం వ్యవహా రంలో ఏ సాయానికీ పనికిరాడన్నమాట. ఆ లలిత కూడా దేనికీ పనికొచ్చేటట్టులేదు. ఇంటికి వెళ్తే ఇద్దరూ వంటకి డబ్బు డలక్కుండా

ఉంటే చాలు! అన్నట్టు, జోగులు! ఆ వెధవెలా ఉన్నాడో దీన్నడి గేస్తే, మనం ముందే జాగ్రత్త పడొచ్చు.

"మరొక్క మాట! జోగులుబా బెలా ఉన్నాడు!" అని అడిగేడు. "దున్నపోతునా ఉన్నాడు!" అని టక్కున సమాధానం చెప్పింది చిన్నమ్మి.

"ఊరోళ్ళందరి సొమ్మూ ఒళ్లో ఒడేసుకుంటే దుక్కపోతునా ఉండడా మరి!" అంది పక్కనున్న సముద్రాలు. జోగులు గురించి కొన్ని బూతుమాటలు కూడా ప్రయోగించిందామె.

రాక్షసిముండలా ఉంది! రివల్యూషనొస్తే ఇలాటి ముండలే మన పేగులు పీకి తెంపేస్తారు. ఇలాటి రాస్కెల్స్‌ని బతికుండగా పెట్రోలేసి తగలెట్టెయ్యాలి,

అనుకున్నాడు శేషగిరి.

అప్ప కోపంతెచ్చుకోవడం గమనించి చిన్నమ్మి ఆమెవైపు తిరిగి, "ఎందుకోలప్ప, ఆ సేతకాని కోపం? ఆడు కొనపోతే నీ మడి సెక్క ఒవుడూ కొన్డా? ఆడు కాపోతె మున్సీబ్బాబున్నాడు. కరనం బాబున్నాడు, దాసుబాబు కొడుకున్నాడు, పిల్లులాజుబాబు అల్లుడున్నాడు-మన కొంపల్తొవ్వేడానికి యెయ్యిమం దున్నారు! సేతనైతే రోకలుచ్చుకు ఆళ్ళందరి బుర్రలూ ఒడిసీ! నేపోతే, ఆళ్ళ బుర్రలు బావు జేయిస్సే ఏళొస్తంది! అందాక ఒల్లకుండు!" అని సముద్రాలి మీద కేకలు వేసింది చిన్నమ్మి.

ఆ తర్వాత, శేషగిరి వైపు తిరిగి, "నువ్వెవురోగాని బావూ! సెడిపోయి నోళ్ళ క్కడుపులుమండి సెడ్డమాటొచ్చిందన్చెప్పి ఏటను కోక! జోగులుబాబూ మున్సీబ్బావూ ఏకవ్వైపోయి మాయప్ప మడి సెక్కెత్తుకు పోనారు. అందుకు మాఁవేం జెయ్యాల? ఆళ్ళ బుర్రలు

సితకబొడిసెయ్యాల ! అది సేతకాక దుమ్మెత్తి తిట్టినన్నాళ్లు తిట్టినాం. తిడితే మడిసెక్క మా ఒళ్ళకాడికొస్తదా ? దాని టయాం ఒచ్చి నప్పుడు కత్తులుచ్చుకున్న దినాలొస్తె సక్కా అదే వచ్చుద్ది! మరుప్పుడు మట్టుకు అందరెలాగున్నారో జోగులుబావూ అలాగే ఉన్నాడు ! సేతులడిపోనాయా ? ఆడికాళ్ళడిపోనాయా ? ఏటీ నేదు ! నిచ్చేపరాయిళ్ళాగున్నాడు ! డాబాయిల్లు కట్టించినాడు. సుట్టుగోడ లెగదిసినాడు. అంటు మాయిడితో ఎయ్యించినాడు, పుగాకు యాపారానికెగబణ్నాడు. పంచాయతీ నెంబరైనాడు. మొన్నటేళ గావాల పట్నంవెల్లి పెల్లానికి మువ్వ లొడ్డానం సెయించుకొచ్చినాడు ! ఆబావు కేం ?! సల్లగున్నాడు!" అంది చిన్నమ్మి, అలా అన్నాక, "మునిసీబ్బావు పచ్చ గుండాలిగాని ఆ బాబూకీ లోటేటేన్నేదు, ఆయమ్మకీ లోటేటేన్నేదు" అని కలిపింది.

పక్కనున్న సముద్రాలు, "ఆయూసులన్ని మనకెందుగ్గాని, రాయే సిలుకా, పోదాంరా ! బాబుతో ఊసుల్జెప్తె బాబు సక్కా యింటాడు గాని, మన పాటెవడడతాడు ? పోదాం బేగిరా !" అంటూ ముందుకి దారితీసింది.

"బావూ ! నువ్వెళ్ళిరా !" అని శేషగిరితో చెప్పి చిన్నమ్మి కూడా ముందుకి అడుగేసింది.

ఇంకా పోల్చనట్టే నాటకం ఆడుతోంది. ఆ "డెవిల్"ని చూస్తే నాకేభయం వేస్తోంది. చిలకలా ఉన్న మనిషి భయపడదా ! కాని.... ఈ చిలుక నిజంగా బలే బావుంది. లుక్ ఎట్ ది స్వింగ్ ! నడకలో ఊపుచూడు ! ఇన్నాళ్ళయింది కాని ఇంకా చెడిపోలేదు. రాత్రి కి ఒస్తుందా ? రాకపోతే, రప్పించడానికి జోగులుగాణ్ని పట్టాలి, ఆ వెధవ ఇప్పుడు బాగుపడ్డట్టున్నాడు.ఆ వెధవ నిప్పుడు పట్టుకొని ఆ రైతు వెధవ నెవణ్నో వాణ్నికూడా రప్పించి, ముందు మన ఎఫేర్ సెటిల్ చేసుకున్నాక, ఆ తరవాత ఈ బ్యూకాలిక్ బిచ్‌కి కబురు పంపించవచ్చు.

బిజినెస్‌ఫస్ట్ ! ముందుగా వ్యాపార వ్యవహారాలు ! ప్లెజర్ ఆఫ్టర్ వర్డ్స్ ! తరువాత సరస సల్లాపాలూ, సరదా దురదలూను ! ముందు వెళ్ళి జోగులుగాణ్ని పట్టుకోవాలి. కామేశంగాణ్ని పలకరిస్తానంతే ! ఆ లలిత, అదెలానూ లాభంలేదు. అంత చిన్నప్పుడే అది వీరనారీ పలుకులు పలికింది. ఇప్పుడదికూడా ఇందాట్లా దాని అప్పలా రాక్షసిలాగే ఉండుంటుంది;

అనుకొంటూ అగ్రహారం వైపు నడిచేడు శేషగిరి.

ఆరున్నరకి సాయంకాలం అయింది. ఏడు గంటలకి చీకటి పడింది. ఊరివెనక కొండవెనక్కి సూర్యుడు దిగబడిపోయినప్పుడు లేచిన మంటలు బాగా చల్లారేయి. ఎన్నాళ్ళదో అలసట తీర్చుకొంది క్కాబోలు చంద్రుడెక్కడో ఒళ్లెరక్క పడుకున్నట్టున్నాడు. చీకటవగానే, చెరువులో చేపల్లా, ఆకాశంలో చుక్కలు తెప్పున తేలుకొచ్చాయి. ఊళ్ళో మినుకు మినుకు దీపాలు పనికి సర్దుకుంటున్నాయి. రైతుల, కూలీల వంటపొయ్యిల్లోంచి లేచే పొగలు, రూపులొచ్చిన ఏడుపుల్లా ఊరంతటా కమ్ముకొంటున్నాయి. ఊరిచుట్టూ ఉన్న మరుగు భూముల్లోనుంచీ,పైనుంచీ వచ్చే కల్లువాసన పేదవాడి పగలాగా ఊరంతా చుట్టుకొంటోంది.సముద్రాలింటికి ఎడంగాఎవరోచేపల్ని మాడుస్తున్నారు; మరెవరో మరికొన్నింటిని కడుగు తున్నారు. ఎక్కడో ఇద్దరాడవాళ్ళు "నీ తాడు తెంపియ్యా" అంటే "నీ కడుపు గోకియ్యా" అని తిట్టుకొంటున్నారు. సాయంకాలంనించీ దొరక్కుండా పరిగెడుతూన్న ఒక పందిని— చాకలివాళ్ళ కర్రలు చివరకి సాధించినట్టున్నాయి— దేవుణ్ని పెనుపిలుపు పిల్చి మూలిగి మూలగి ఆగిపోయింది ఆ పంది. అన్నీ ఇళ్ళకిపోగా వెనక్కుండిపోయిన కాకులు ఆకాశంలో అజాకనిపించక హడావిడిగా అటూ ఇటూ ఎగిరి వెళ్తున్నాయి. పీక నులిమేయడానికి పిలుస్తున్నారో, లేక, బుట్టకింద పడుకుందికి పిలుస్తున్నారో తెలీక ఓ

నల్లకోడి అటూ ఇటూ తప్పించుకు పరిగెడుతూ ఒకే హడావిడి చేస్తోంది. ఇళ్ళమధ్య బుగ్గిలో, బుడ్డిదీపం పక్కన పెట్టుకొని ఓ పదేళ్ళ పిల్ల బుగ్గిలో పడిపోయిన నూకలన్నీ చేట్లోకి ఎత్తుకుని చెరుగుతోంది. రెండు పాకల మధ్య సందులో బురదలో, కుళ్లలో ఆడమనిషెవరో స్నానం చేస్తున్నట్టుంది— ఆమె గాజులు గలగల చప్పుడు జారే నీళ్ళ జలజల చప్పుడుతో మిళితమై వినిపిస్తోంది. సందులోంచి వచ్చే బురదనీటిలో కొందరు పిల్లలు తపతప గెంతుతూంటే పక్కనే కూర్చున్న ఓ ఆరేళ్ళ కుంటిపిల్లడు సంతోషం పట్టలేక చప్పట్లు కొట్టికొట్టి, అంతలోనే ఎందుకోగాని వెక్కివెక్కి ఏడవడం ప్రారంభించేడు.

పాకలో ముందునడవలో ఓ వారనున్న పొయ్యి ముందు కూర్చున్న సముద్రాలు ఏదీ వినే పరిస్థితిలో లేదు. ఆమె ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు ఆమెని చూడగానే తెలుస్తోంది. పొయ్యిమీద కుండలో గంజెగింజలింకా ఉడుక్కి రాలేదు. మధ్యాహ్నం ఏరి తెచ్చుకున్న ఎండుపుల్లల్ని ఒకటీ ఒకటీ మంటలోకి తోస్తూ, కాల్తూన్న పుల్లల్ని ఎగసనదోస్తూ, పుష్టిలేని మంటలోకీ. చప్పున నుసిగామారే నిప్పులోకీ, ఏదో ఆవేశించిన దాన్లా అలా చూస్తూ కూర్చుంది సముద్రాలు.

అతనే! అతనే!

అప్పుడు రువ్వులాగున్నాడు. ఇప్పుడు రివటలాగున్నాడు. అంతే తేడా! మరింకేం లేదు. ఇప్పుడు బాగా రంగు కూడా తేలేదు. అప్పటికీ ఇప్పటికీ మారేదేకాని మంచి బంగారంలోకి మారేడు. ఈ మనిషిని గుర్తుపట్టలేకపోయా డెందుచేత? ఈ మనిషి మనిషిలా లేదు. దయ్యంలా ఉంది. అందుచేత! కాని — లేదు! పోలికపట్టేడు. ఈ మనిషి చెల్లెల్ని చూసి ఈ మనిషే అనుకున్నాడు. అతనికింకా ఆ డదంటే ఆశపోలేదు. చెల్లెలి గుండెలు చూసి అందుకే ఆ కళ్ళు అలా

మెరిసేయి. ఆశకాదది! దురాశ! ఆవేళ ఆ రాత్రి ఆ చీకటి కొట్లో కుంపటిదగ్గిర చలి కాచుకున్నట్టు ఈ మనిషి దగ్గిర వెచ్చగా రాత్రి వెళ్ళబుచ్చేడు. ఆ నిప్పు ఆరిపోగానే ఇవాళ మరో చలిమంట కోసం చేతులు జాస్తున్నాడు. "సిలుకమ్మ ఎర్రిది కాదు" దానికన్నీ తెలుసు. అతన్ని చూడగానే "దొంగనాగున్నాదే! సూడోలె!" అంది. చెల్లెల్ని చూస్తే దానత్తకే గడగడ! మునిసీబ్బావుకే గడగడ! అది ఎర్రిది కాదు. చూడగానే కనిపెట్టేసింది. "కొండసిలవ నాగున్నాదే! సేతుల కర్రుంటే పావేఁ అనుకొని కొట్టేసి పోదును!" అంది "సిలకమ్మ". అతని ఆటలు దాన్దగ్గిర సాగవు. "నాటకాలూ ఏసికాలూ సూస్తుండగా కట్టిం చేస్తాది."కాని దురాశ పడ్డం మాత్రం పడుతున్నాడతను.అప్పటికీఇప్పటికీ ఈ మనిషి మారింది కాని ఆ బాబు మార్లేదు. ఎందుచేత ? అప్పటికీ ఇప్పటికీ ఎన్నాళ్ళయింది ? ఈ మనిషిదీ ఆ బాబుదీ ఒకే వయసయుం డాలి. లేక ఈ మనిషే కొద్దిగా చిన్నదేమో! ఆ రోజున ఇదే మనిషిని కావలించుకు గుండెకి చేర్చుకున్నవాడు అదే మనిషిని ఈ రోజున చూసి దయ్యాన్ని చూసినట్టు జడుసుకున్నాడు. ఆ రోజుకీ ఈ రోజుకీ మధ్య నడిచిన కాలం. ఒకే కాలం, ఈ మనిషినెందుకీ విధంగా దయ్యపు బతుకులోకి దించింది, అతణ్నెందుకావిధంగా పసిడిబొమ్మగా పెంచింది?

అని అస్పష్టంగా ప్రశ్నించుకొంది సముద్రాలు,

సముద్రాలింటికి ఎడంగా నిల్చోని చూస్తే ఆ ఇంట్లో లోపలంతా పగలే చీకటిగా కనిపిస్తుంది. ఇంటి తాటికమ్మలన్నీ ఏనాడో బాగా ఎండి పోడంచేత ఇప్పుడవి చూడ్డానికి మసీ నుసీ కలిపి చేసిన బొమ్మకమ్మ రేకుల్లా కనిపిస్తున్నాయి. గాలి గాలికీ, ప్రతి చిన్నగాలికీ అవి పొట్టు పొట్టుగా రాలిపోతున్నాయి.

ఇంటి ముంజూరు బాగా కిందికి ఉండడంచేత పొయ్యి దగ్గిర కూర్చున్న సముద్రాలు పూర్తిగా కనిపించంలేదు. ఏదో తలలేని మొండెం అక్కడ కూర్చున్నట్టనిపిస్తోంది. వారనున్న పొయ్యి మంట గాలిలేని గుహలో చాలీచాలని ఆకుమంటలా కనిపిస్తోంది.

అగ్గికి పుల్లలు అందిస్తూ అందిస్తూ ఆ పుల్లల వెలుగులోకి రెప్ప లార్పకుండా చూస్తోంది సముద్రాలు. అదే మాదిరి మంటలో తన బతుకంతా మండిపోయి నట్టనిపిస్తోందామెకి. తన చిన్నతనంలో తన తల్లి కూడా మండే పొయ్యి ముందు అదే విధంగా కూర్చోడం, ఆమెకి గుర్తుకొస్తోంది. దగ్గిరికి వెళ్ళి, తల్లి ముఖంలోకి చూస్తూ, "అమ్మా, ఒలే అమ్మా! నీ కళ్ళల్ల మంటలున్నాయే!" అంటే అందుకు సమాధానంగా, "కళ్ళల్లో మంటలు కావమ్మా! అయి కడుపులో నెగిసిన మంటలు!" అని కళ్లు తుడుచుకొంటూ తల్లి చెప్పిన మాటలు ఆమెకిప్పుడు చెవుల్లో మంటల చప్పుళ్లా వినిపిస్తున్నాయి. మధ్యానం కూడు కోసం ఇంటికొచ్చే ఆమె తండ్రి ఎర్రని రూపు కూడా ఆమెకిప్పుడు గుర్తుకొస్తోంది. వంటినిండా నిప్పులంటుకున్నట్టు అతని వంటినిండా వుండే చెమట బిందువులన్నీ ఆమెకిప్పుడు కళ్ళముందు కట్టినట్టు భయంకరంగా కనిపిస్తున్నాయి. పెళ్లినాడు పచ్చని బంగారంలా ఉండే తన పెనిమిటి రూపు రూపంతా కాలే పెనంమీద దొర్లిస్తే మాడిపోయి నట్టు మాడిపోవడం ఆమెకిప్పుడు కళ్లముందు అతి భయంకరంగా కనిపిస్తోంది. ఒక రోజు రాత్రి, పడుకోబోయేముందు— ఆ రోజు రాత్రే చనిపోయేడతను ___ ఒక రోజు రాత్రి, ఆఖరిసారిగా పడుకోబోయే ముందు, "మన పంటలు మనయి కావు, మన పొలాలు మనయి కావు, మన రెక్కల కస్టం మన్దికాదు, మన పిల్లల పేణాలు మనయి కావు, మన బతుకులే మనయి కావు" అని చెప్పిన తన పెనిమిటి మాటలిప్పుడామె చెవుల్లో సెగల్లా రొదలు చేస్తూ గుర్తులోకొస్తున్నాయి. కాళ్లు

కాలిపోగా మిగిలిన ఆమె సగం కొడుకు రూపు ఆమె కళ్లని కాల్చేస్తూ గుర్తుకొస్తోంది.

మండే పొయ్యి మంటలో జీవితం అంతా కూడా అతి స్పష్టంగా చూడగలగడం చేత రెప్ప లార్పకుండా తప్ప మరోలా చూడలేకపో తోంది సముద్రాలు. కాలి వెళ్లిపోయిన రోజుల్లో మండి మాయమై పోయిన బొమ్మలన్నీ ఆమెకి చప్పు చప్పున మళ్లీ కనిపించి భగ భగ మండే మంటలో ఎండగ్గిపుల్లలు ఏ విధంగా మాయమవుతాయో ఆమెకి చూపించి చెప్తున్నాయి. తల్లితండ్రులు, అన్నాదమ్ములు, అత్తమామలు, కట్టుకున్న నాథుడు, కన్నపిల్లలు, చుట్టాలు పక్కాలు నేస్తాలు ఎందరెందరో ఎన్నో పొయ్యిల్లో మండిపోడం ఆమె కళ్లారా చూస్తోంది. రాతిబొమ్మలకి పై పూతలకోసం ఎన్నో పొయ్యిలమీద ఎన్నో కుండల్లో వెండి బంగారా లొండడానికి ఎన్నో చితుకులు, ఎన్నో ఎండగ్గిపుల్లలు. ఎన్నెన్నో పచ్చటి బతుకులు!

ఎన్నో ప్రాణాలు ఎందుకోసం అలా మండిపోయి భస్మం అయిపోయేయో సుస్పష్టంగా చూసిన సముద్రాలి కళ్లు మంట మండి నట్టు మండిపోతూ మరింక ఆ నొప్పిని ఓర్చుకోలేక పోతున్నాయి. గుండెలోని పోటుని ఆమె చేతులు ఆపుకోలేక పోతున్నాయి. నొప్పితో ఆమె ముందుకి ఇంకా ముందుకి వంగిపోతూంది. ముందుకలా వంగి పడి పోతూన్నప్పుడు, పొయ్యి మీద కుండ వెనక్కి తిరగబడి పోయిం దన్న సంగతే ఆమెకి తెలియలేదు. అయ్యో! నొప్పి! బాబుల్లారా. తండ్రుల్లారా నొప్పి నొప్పి! లెగలేను లెగలేను, నొప్పి! నారాయిన మూర్తీ, భగవంతుడా! నొప్పి, తండ్రి, నొప్పి!

రాత్రి ఏడుగంటలకల్లా భోపనం చేసేసి జోగులింటి డాబామీద పిట్టగోడమీద కుడికాలు ఆన్చి సిగరెట్టు కాలుస్తూ నిల్చున్నాడు శేషగిరి.

అతను కట్టుకున్న గుండారూ, తొడుక్కున్న బనియనూ, భుజంమీద వేళాడ దీసుకున్న తువ్వాలూ ఆ చీకట్లో దయ్యంబట్టల్లా, మనిషి లేకుం డానే నిలబడిపోయినట్టు కనిపిస్తున్నాయి.

శేషగిరి చుట్టూ చూసేడు.

దూరాన్న ఉన్న పాకల్లోంచి వచ్చే పొగ తప్పిస్తే, చుట్టూ మిగతా అంతా చూడ్డానికి హాయిగా బావుంది. పైన కలకల్లాడుతూ చుక్కలు వికసించడంతో, మల్లెలు జల్లిన నల్లని పట్టు తివాసీలాగ ఆకాశం నిగనిగ మెరుస్తోంది. జోగులింట్లో పెరట్లో మల్లె పందిర్నించి మధురంగా వెచ్చని వాసన గుమగుమ లాడుతూ డాబామీదికి పాకురు తోంది. కింద జోగులి పెళ్ళాన్ని కాబోలు "ఇయ్యాళ్టికి కుశిన్ని ఎంగిలి మెతుకులుంటే ఒడేయ్ తల్లీ!" అని నెమ్మదిగా సన్నగా ఎవరో అడుగుతున్నారు. "మనిషెలా ఉంటుందో కాని కంఠం మాత్రం కమ్మగా ఉంది" అనుకున్నాడు శేషగిరి.

అంతలో అక్కడ పాకలమధ్య ఎందుకోగాని పెద్ద గోల లేచింది, మరో పావుగంటకి జోగులు చుట్టకాలుస్తూ నెమ్మదిగా, "ఏం బావగారు? దేనికోసం అలా పనిగట్టుకు చూస్తున్నారు?" అంటూ డాబా మీదికొచ్చేడు. అతని పొట్టిచేతుల చొక్కా, అతని పొట్టిపంచా ఆ చీకట్లో సరిగా కనిపించకపోయినా, అతను అడ్డుగా బలిసేడన్న సంగతి మాత్రం స్పష్టంగా తెలుస్తోంది.

"నువ్వేం తెస్తావో అని చూస్తున్నాను! దానికేంగానీ, ఇందా కటినించీ అక్కడ ఏఁవిఁటా కాకిగోల?" అంటూ కాల్తూన్న సిగ రెట్టుతో పాకలవైపు చూపించేడు శేషగిరి.

"అదా! పోలిగాడి పెళ్లాం — మీగ్గ్యాపకంలేదూ? మీ కెందుగ్గ్యా

పకం ఉండదు? భ్రష్టముండ— ఫకీరు ముండై పోయింది లెండి —
అదిందాక పొయ్యి దగ్గిర అలా కూర్చుని కూర్చుని అందులో పడి
పోయిందిట. పొయ్యిలో పడిపోయి చచ్చిపోయిందో, లేక చచ్చిపోయి
పొయ్యిలో పడిపోయిందో ఇంకా తేల్లేదు. చచ్చిడం మాత్రం చచ్చి
సింది. దాని కుంటి కొడుకూ, చెల్లెలి ముండా ఏడుస్తున్నారు. అదీ ఆ
గోల!" అన్నాడు జోగులు.